


RNI NO: TGTEL/26/A0383
డైనమిక్
# జనం వాయిస్
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM




ప్రచురణ : , తెలంగాణ సంపుటి 01, సంచిక 192, ఎడిటర్ : గట్టు మహేష్ గౌడ్ పేజీలు -08 శనివారం - 15 - ఆగష్టు - 2026 వెల రూ.2/-

## నామి'లేట్'డ్ పదవులు ఎప్పుడు?

### సీఎం విదేశీ పర్యటనకు ముందా... ఆ తర్వాతేనా అన్న చర్చ

- కార్పొరేషన్ పదవులు ఎప్పుడు భర్తీ చేస్తారన్న దానిపై అధికార పార్టీలో కొరవడిన స్పష్టత
- ఒక్కో ఉమ్మడి జిల్లాకు 20 మందికి తగ్గకుండా ఆశావహులు
- ఢిల్లీలో తెలంగాణ నేతల భేటీల తర్వాత గాంధీభవన్ వర్గాల్లో కొత్త చర్చ



హైదరాబాద్: నామినేటెడ్ పోస్టుల భర్తీ ఎప్పుడనేది అధికార కాంగ్రెస్ పార్టీ నేతల్లో గుబులు పుట్టిస్తోంది. ముఖ్యంగా గత నెలలో పదవీకాలం పూర్తయిన కార్పొరేషన్ చైర్మన్లు, ఇప్పటి వరకు భర్తీ చేయని కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఎప్పుడు ప్రకటిస్తారనే విషయంలో కంగాళీ ఏర్పడింది. అసలు ఈ పోస్టుల భర్తీ ఉంటుందా ? ఉంటే ఎప్పుడు? ప్రాతిపదికలేమిటి? గతంలో పనిచేసిన వారికి మళ్లీ అవకాశమిస్తారా? పూర్తిగా కొత్త వారిని మిగతా 2 లో

### రాష్ట్రంలోని 130 జలాశయాల్లో
## పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుపై అధ్యయనం

- ఏపీ ఇంధన రంగంలో కీలక మార్పులకు శ్రీకారం..
- 130 జలాశయాల్లో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులపై చంద్రబాబు ఫోకస్
- సెప్టెంబర్ నాటికి 6 లక్షల 'పీఎం సూర్య ఘర్' సోలార్ కనెక్షన్ల ఏర్పాటుకు ఆదేశం మిగతా 2 లో



### ప్రత్యేక భద్రతా ఫీచర్లు .. క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ ధ్రువీకరణ
## ఇక 'స్మార్ట్'గా రేషన్ కార్డు



- నేడు సంగారెడ్డిలో సీఎం చేతుల మీదుగా అందజేత
- 'గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ'అనే పదాలను ఉబ్బెత్తుగా ముద్రించారు
- చేతితో తడిమినప్పుడు ఈ అక్షరాలు స్పష్టంగా తెలుస్తాయి
- నకిలీ కార్డుల తయారీని అడ్డుకోవడం, ప్రజా పంపిణీ వ్యవస్థలో లబ్ధిదారుల గుర్తింపును బలోపేతం చేయడం లక్ష్యం

2లో



## నీరే మాకు ఆధారం.. భారత్ ఏకపక్ష నిర్ణయాలను అడ్డుకుంటాం: షెహబాజ్ షరీఫ్

- సింధు నదీ జలాల వివాదంపై షెహబాజ్ షరీఫ్ ఘాటు వ్యాఖ్యలు
- పాకిస్తాన్‌కు వచ్చే నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటే తమ దేశం సహించదని వ్యాఖ్య
- తమ నీటి హక్కుల కోసం అన్ని వేదికలపై పోరాడుతామని హెచ్చరిక

2లో

## అమరావతిలో అగ్నిమాపక విభాగానికి సరికొత్త శక్తి

### ఏపీ ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు రూ.40 కోట్లతో కొత్త వాహనాలు

- మొత్తం 58 ఆధునిక ఫైర్ ఇంజన్లను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- ఇరుకైన వీధుల కోసం ప్రత్యేకంగా క్విక్ రెస్పాన్స్ వాహనాలు
- గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో సేవలకు అధునాతన ఫైటర్లు



అమరావతి: అగ్నిప్రమాదాలు, విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడేందుకు అగ్నిమాపకశాఖను మరింత ఆధునికంగా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. 15వ ఆర్థిక సంఘం మిగతా 2 లో



## త్వరలో పార్టీ, కేంద్ర కేబినెట్‌లో మార్పులకు సన్నాహాలు

2లో

పార్లమెంట్ సెషన్‌లో ఎదురుదెబ్బ.. దిద్దుబాటు చర్యల్లో మోదీ సర్కార్!
కీలక బిల్లులను
ఆమోదింపజేసుకోలేకపోయిన మోదీ సర్కార్

## ప్రజలకు అందుబాటులోకి సనత్‌నగర్ 'టిమ్స్'..

### 17న ప్రారంభించనున్న రేవంత్‌రెడ్డి

- రూ.1,070 కోట్ల వ్యయంతో 1,082 పడకలతో నిర్మాణం
- మొదట 582 పడకలతో సేవలు
- అక్టోబర్‌కు పూర్తిస్థాయిలో అందుబాటు
- నిమ్స్ తరహాలో స్వయంప్రతిపత్తి హోదాతో కార్యకలాపాలు మిగతా 2 లో



## "మీ అభివృద్ధి కోసం నిలబడుతా

### పది మందికి మేలు చేయాలన్న ఆలోచన నాకుంది

- గత పాలనను, ఈ రెండేళ్ల పాలనను బేరీజు వేసుకోవాలి
- మంచి చేయడానికి చిత్తశుద్ధి కావాలి
- సొంతింటి కల నెరవేరడానికి నూటికి నూరు శాతం అండగా నిలబడుతాం
- గత ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వేటినీ నిలిపివేయలేదు




హైదరాబాద్: నిషేధిత జాబితాల్లో ఉన్న భూములకు సంబంధించి హక్కుదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. నిషేధిత జాబితా (22 ఏ చేరిన భూముల సర్వే నంబర్లకు బై-నంబర్లు ఇచ్చి హక్కుదారుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కోర్ అర్బన్ #CURE ప్రాంత పరిధిలో మిగతా 2 లో

## 22 కి.మీ. రోడ్డుకు రూ. 1,519 కోట్ల ఖర్చు చూపిస్తున్నారు అంబటి రాంబాబు



- అమరావతి పేరుతో భారీగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న అంబటి
- తాత్కాలిక భవనాలు, స్టీల్ బ్రిడ్జిల పేరుతో వేల కోట్లు తగలేస్తున్నారని ఆరోపణ
- కమీషన్ల కోసం అంచనాల బడ్జెట్ పెంచుకుంటూ పోతున్నారని విమర్శ

2లో



### భారత్ గురించి ప్రపంచం ఏమనుకుంటోంది?
## 36 దేశాల సర్వేలో ఆసక్తికర విషయాలు!

2లో

36 దేశాల సర్వేలో భారత్‌కు 45 శాతం సానుకూలత
శ్రీలంకలో భారత్‌కు అత్యధికంగా 79 శాతం మద్దతు
పాకిస్థాన్‌లో 91 శాతం మందికి భారత్‌పై వ్యతిరేకత

### ప్రాధాన్యతా క్రమంలో 36 ప్రాజెక్టులు
## పూర్తి చేయాలని నిర్ణయం

### యుద్ధప్రాతిపదికన పోలవరం పనులు.. సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

- పోలవరం, వెలిగొండ ప్రాజెక్టుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- 89.9 శాతం మేర పోలవరం సివిల్ పనులు పూర్తయినట్టు వెల్లడి
- గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ పనులు చేపట్టాలని ప్రత్యేక సూచన
- రాష్ట్రంలో వర్షపాతం, భూగర్భ జలాలపైనా సమావేశంలో చర్చ



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ సహా రాష్ట్రంలోని ప్రాధాన్యతా ప్రాజెక్టుల పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల వారీగా మిగతా 2 లో

డైనమిక్ జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE WWW.JANAMVOICE.COM



## భారత్ గురించి ప్రపంచం ఏమనుకుంటోంది?
# 36 దేశాల సర్వేలో ఆసక్తికర విషయాలు!

ఢిల్లీ: ప్రపంచ దేశాల దృష్టిలో భారత్ ఎలా ఉంది? మన దేశంపై ఎవరికెంత అభిమానం? ఎవరు వ్యతిరేకంగా ఉన్నారు? ఈ ప్రశ్నలకు తాజాగా విడుదలైన 'ప్యూ రీసెర్చ్ సెంటర్' సర్వే ఆసక్తికర సమాధానాలు ఇచ్చింది. 36 దేశాల్లో 42 వేల మందికిపైగా అభిప్రాయాలను సేకరించిన ఈ సర్వేలో.. భారత్‌పై సానుకూలతే ఎక్కువగా కనిపించింది. ఈ దేశాల్లో భారత్‌పై సగటున 45 శాతం మంది సానుకూల అభిప్రాయం వ్యక్తం చేశారు. 41 శాతం మంది ప్రతికూలంగా స్పందించారు. భారత్‌కు అత్యధిక మద్దతు శ్రీలంకలో కనిపించింది. అక్కడ ఏకంగా 79 శాతం మంది భారత్‌పై సానుకూల అభిప్రాయం వెల్లడించారు. కేవలం 11 శాతం మందే వ్యతిరేకంగా స్పందించారు. 2024లో భారత్‌పై సానుకూలంగా ఉన్న శ్రీలంక వాసుల సంఖ్య 65 శాతం కాగా.. ఇప్పుడు అది 79 శాతానికి పెరిగింది. కెన్యాలో 71 శాతం, బ్రిటన్‌లో 71 శాతం, జర్మనీలో 63 శాతం, ఇజ్రాయెల్‌లో 60 శాతం, ఇటలీలో 56 శాతం, స్వీడన్‌లో 55 శాతం మంది భారత్‌పై సానుకూలంగా ఉన్నారు. జపాన్‌లో 55 శాతం, థాయ్‌లాండ్‌లో 55 శాతం, సింగపూర్‌లో 51 శాతం, ఇండోనేషియాలో 50 శాతం మంది భారత్‌ను సానుకూల దేశంగా భావిస్తున్నారు. అయితే పాకిస్థాన్ మాత్రం పూర్తిగా భిన్నంగా ఉంది. అక్కడ 91 శాతం మంది భారత్‌పై ప్రతికూల అభిప్రాయం వ్యక్తం చేశారు. కేవలం 7 శాతం మందే సానుకూలంగా స్పందించారు. భారత్-పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ఫలితం పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు. బంగ్లాదేశ్‌లో 42 శాతం మంది భారత్‌కు అనుకూలంగా ఉండగా.. 51 శాతం మంది వ్యతిరేకంగా ఉన్నారు. అమెరికాలో అభిప్రాయాలు దాదాపు సమానంగా ఉన్నాయి. 50 శాతం మంది భారత్‌పై ప్రతికూలంగా స్పందించగా.. 45 శాతం మంది సానుకూలంగా ఉన్నారు. 2023లో భారత్‌పై సానుకూలంగా ఉన్న అమెరికన్ల సంఖ్య 51 శాతం ఉండగా.. 2026లో 45 శాతానికి తగ్గింది. మొత్తంగా చూస్తే ఆసియా, ఆఫ్రికాలో భారత్‌కు మంచి ఆదరణ కనిపించింది. యూరప్, అమెరికాలో మాత్రం అభిప్రాయాలు మిశ్రమంగా ఉన్నాయి. పొరుగు దేశాల్లో పాకిస్థాన్ అత్యంత ప్రతికూల వైఖరితో ప్రత్యేకంగా నిలిచింది.

## రాహుల్ గాంధీకి భారీ ఊరట..
## సావర్కర్ వ్యాఖ్యల కేసు కొట్టేసిన సుప్రీం

ఢిల్లీ: సావర్కర్‌పై వ్యాఖ్యలకు సంబంధించి కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనపై కొనసాగుతున్న క్రిమినల్ పరువునష్టం కేసును సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. కేసు కొనసాగించేందుకు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా తీసుకోవాల్సిన అనుమతి పొందలేదని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. అవసరమైన ప్రభుత్వ అనుమతి లేకుండా కేసు కొనసాగించలేమని పేర్కొంటూ రాహుల్ గాంధీ పిటిషన్‌ను అనుమతించింది. దీంతో దిగువ కోర్టు జారీ చేసిన సమన్లను కూడా రద్దు చేసింది. 2022లో మహారాష్ట్రలో సాగిన భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ సావర్కర్‌పై వ్యాఖ్యలు చేశారు. సావర్కర్ బ్రిటీషర్లకు సేవకుడిగా వ్యవహరించారని, బ్రిటీష్ ప్రభుత్వం నుంచి పెన్షన్ తీసుకునేవారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై న్యాయవాది నృపేంద్ర పాండే దిగువ కోర్టును ఆశ్రయించారు. రాహుల్ వ్యాఖ్యలు పరువునష్టం కలిగించడంతో పాటు వర్గాల మధ్య విభేదాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని ఫిర్యాదు చేశారు. దీంతో దిగువ కోర్టు ప్రాథమికంగా కేసు విచారణకు అర్హమైనదేనని భావించింది. భారతీయ శిక్షాస్మృతిలోని 153ఏ, 505 సెక్షన్ల కింద రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. అయితే సుప్రీంకోర్టు విచారణలో కీలక లోపం బయటపడింది. ఈ సెక్షన్ల కింద కేసు కొనసాగించేందుకు అవసరమైన ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వ అనుమతి తీసుకోలేదని తేలింది. దీంతో ఆ లోపాన్ని పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు మొత్తం క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసింది.

## నీరే మాకు ఆధారం.. భారత్ ఏకపక్ష
## నిర్ణయాలను అడ్డుకుంటాం: హెహబాజ్ షరీఫ్

ఢిల్లీ: సింధు నదీ జలాల ఒప్పందం వివాదంపై భారత్‌ను ఉద్దేశించి పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌కు నీరే ప్రధానమైన జీవనాధారమని, నదీ జలాల విషయంలో తమ దేశానికి వర్తించే హక్కులపై రాజీ పడే ప్రసక్తి లేదని ఆయన తేల్చి చెప్పారు. ఇస్లామాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ... సింధు నదీ జలాల ఒప్పందంలో మార్పులు చేయడం కానీ, పాకిస్థాన్‌కు వచ్చే నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడం లేదా డైవర్ట్ చేయడం కానీ చేస్తే దాన్ని తమ దేశం ఏమాత్రం సహించదని స్పష్టం చేశారు. తమకు 'నీరే రెడ్ లైన్' అని, ఈ విషయంలో భారత్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. పహల్‌గామ్ ఉగ్రదాడి అనంతరం భారతదేశం సింధు నదీ జలాల ఒప్పందాన్ని సవరించాలని లేదా పునఃసమీక్షించాలని కోరుతూ పాకిస్థాన్‌కు నోటీసులు పంపిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 60 ఏళ్ల నాటి ఈ ఒప్పందంలో మార్పులు తెచ్చేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలను పాకిస్థాన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. తమ నీటి హక్కులను కాపాడుకోవడానికి దౌత్యపరంగా, చట్టపరంగా అన్ని వేదికలపైనా పోరాడతామని షరీఫ్ పేర్కొన్నారు.

## ప్రజలకు అందుబాటులోకి సనత్‌నగర్ 'టిమ్స్'..
## 17న ప్రారంభించనున్న రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: నగర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో నిర్మించిన సనత్‌నగర్‌లోని మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎంసీఆర్ టిమ్స్) ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ నెల 17వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని అధికారికంగా ప్రారంభించనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రి ప్రాంగణంలో 22.6 ఎకరాల విస్తీర్ణంలో రూ.1,070 కోట్ల భారీ బడ్జెట్‌తో దీన్ని నిర్మించారు. మొత్తం 1082 పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ ఆసుపత్రిలో తొలిదశలో 582 పడకలతో సేవలను ప్రారంభించనున్నారు. మిగిలిన 500 పడకలు ఈ ఏడాది అక్టోబర్ నాటికి అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఇప్పటికే మే నెల నుంచి ఓపీ విభాగంలో ట్రయల్ రన్ నిర్వహిస్తుండగా, రోజూ 200 నుంచి 250 మంది వరకు రోగులు చికిత్స పొందుతున్నారు. ఈ ఆసుపత్రి ప్రధానంగా నాలుగు కీలక విభాగాలకు కేంద్రంగా నిలవనుంది. కార్డియాక్ (గుండె సంబంధిత), నెఫ్రాలజీ-యూరాలజీ (మూత్రపిండాల సంబంధిత), అవయవ మార్పిడి, ట్రామా విభాగాల్లో ప్రత్యేక వైద్య సేవలు అందించనున్నారు. వీటికి అనుబంధంగా మరో 37 విభాగాలు పనిచేస్తాయి. ఈ ఆస్పత్రికి నిమ్స్ తరహాలోనే స్వయంప్రతిపత్తి హోదా కల్పించారు. దీంతో నిధులను సొంతంగా సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే, తొలి ఐదారేళ్ల పాటు ప్రభుత్వం గ్రాంట్ల రూపంలో ఆర్థిక సహాయం అందిస్తుంది. వాస్తవానికి, గత ఏడాది డిసెంబర్‌లో, ఆ తర్వాత ఉగాదికి ఈ ఆసుపత్రిని ప్రారంభించాలని భావించినా, పనులు పూర్తికాకపోవడంతో వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు అన్ని పనులు పూర్తికావడంతో ప్రభుత్వం దీనిని ప్రారంభించేందుకు సిద్ధమైంది.

## త్వరలో పార్టీ, కేంద్ర కేబినెట్‌లో మార్పులకు సన్నాహాలు

ఢిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో కీలక బిల్లులను ఆమోదింపజేసుకోవడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి అనూహ్యంగా ఎదురుదెబ్బ తగిలింది. ఎఫ్‌సీఆర్‌ఏ, డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ వంటి కీలక బిల్లుల విషయంలో ముందుకు వెళ్లలేకపోవడంతో బీజేపీ నాయకత్వం ఆత్మరక్షణలో పడినట్టు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో నష్ట నివారణ చర్యలకు దిగిన ప్రధాని మోదీ, త్వరలో పార్టీలోనూ, కేంద్ర కేబినెట్‌లోనూ మార్పులకు శ్రీకారం చుట్టనున్నారని తెలుస్తోంది. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్‌ఏ) సవరణ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. అంతర్జాతీయంగానూ ఒత్తిడి రావడంతో కేంద్రం ఈ బిల్లును ప్రస్తుతానికి పక్కనపెట్టినట్టు సమాచారం. మరోవైపు, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీ తీర్మానం చేయడంతో, ఈ బిల్లుకు పరోక్షంగా మద్దతివ్వాలనుకున్న డీఎంకే కూడా పునరాలోచనలో పడింది. ఇది కూడా కేంద్రానికి ప్రతికూలంగా మారింది. కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలతో ప్రతిపక్షాలు మరింత బలం పుంజుకుని ఉభయ సభలను స్తంభింపజేశాయి. ఈ పరిణామాల నేపథ్యంలో హోంమంత్రి అమిత్ షా పార్లమెంటుకు రాకపోవడం, ప్రధాని మోదీ తన కార్యాలయానికే పరిమితం కావడంతో బీజేపీ ఆత్మరక్షణలో పడిందనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. ప్రతిపక్షాల దాడి సమయంలో కొందరు విధేయులైన ఎంపీలు మినహా, పార్టీ సీనియర్ నేతలు మౌనంగా ఉండటం కూడా మోదీ శిబిరంలో కలవరం రేపినట్టు తెలుస్తోంది. ఈ ఎదురుదెబ్బ నుంచి కోలుకుని, తిరిగి బలం పుంజుకునేందుకు ప్రధాని మోదీ రాబోయే మూడు నెలల్లో కీలక చర్యలు చేపట్టనున్నారని సమాచారం. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఎన్నికలు జరగనున్న ఉత్తరప్రదేశ్‌పై మోదీ, అమిత్ షా పూర్తి దృష్టి సారించారు. ఈ దిశగానే పార్టీ, కేబినెట్‌లో మార్పులు ఉండబోతున్నాయని పార్టీ వర్గాలు అంటున్నాయి. త్వరలోనే యూపీలో భారీ ఎత్తున ఎన్డీఏ సమావేశం నిర్వహించనున్నారు. ఈ నెలాఖరులోపు పార్టీపరమైన మార్పులు, చేర్పులు ప్రకటించడంతో పాటు, కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను కూడా వేగవంతం చేయనున్నారని తెలుస్తోంది. అదే సమయంలో, పార్టీలో కొంతకాలంగా దూరంగా ఉంటున్న సీనియర్ నేతలను సైతం తిరిగి విశ్వాసంలోకి తీసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే మాజీ స్పీకర్ సుమిత్రా మహాజన్, అహ్లూవాలియా వంటి నేతలతో ప్రధాని చర్చలు జరిపినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

## 22 కి.మీ. రోడ్డుకు రూ. 1,519 కోట్లు
## ఖర్చు చూపిస్తున్నారు: అంబటి రాంబాబు

అమరావతి: అమరావతి రాజధాని నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన పేరుతో కూటమి ప్రభుత్వం భారీగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, అమరావతి అనేది అద్భుత నగరం ఎంతమాత్రం కాదని అన్నారు. అది కేవలం అవినీతి, దోపిడీకి నిలయంగా మారిందని విమర్శించారు. రాజధాని నిర్మాణాలు ఎప్పటికీ పూర్తి కావని... తాత్కాలిక భవనాలు, స్టీల్ బ్రిడ్జిల పేరుతో అప్పులు చేసి మరీ వేల కోట్ల రూపాయలు తగలేస్తున్నారని అంబటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా రహదారుల నిర్మాణంపై తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తూ, 22 కిలోమీటర్ల రోడ్డుకు రూ. 1,519 కోట్ల ఖర్చు చూపిస్తున్నారని విమర్శించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కిలోమీటర్ రోడ్డుకు రూ. 180 కోట్లు ఖర్చు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు సరైన న్యాయం జరగలేదని, కమీషన్ల కోసమే అంచనాల బడ్జెట్‌ను పెంచుకుంటూ పోతున్నారని మండిపడ్డారు.

# అమరావతిలో అగ్నిమాపక విభాగానికి సరికొత్త శక్తి

మొదటి పేజి తరువాయి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేసిన సుమారు రూ.40 కోట్ల విలువైన 58 అగ్నిమాపక వాహనాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రోడ్డులో ఫైర్ సేఫ్టీ వాహనాలకు సీఎం జెండా ఊపారు. అగ్నిమాపక శాఖ అధికారులు ఆ వాహనాల ప్రత్యేకతలను సీఎంకు వివరించారు. అలాగే గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులకు ఉపయోగపడేలా... ప్రమాద ప్రాంతాలకు వేగంగా చేరుకుని తక్షణమే అగ్నిమాపక సేవలు అందించేలా రూ.18.68 కోట్ల విలువైన 25 అధునాతన అగ్నిమాపక వాహనాలు అందుబాటులోకి వచ్చాయని అధికారులు తెలిపారు. పెద్ద అగ్నిప్రమాదాల సమయంలో నిరంతర నీటి సరఫరాకు ఉపయోగపడేలా రూ.14.79 కోట్ల విలువైన 20 వాటర్ బౌజర్లను సిద్ధంగా ఉంచుకున్నామని సీఎంకు అధికారులు చెప్పారు. ఒక్కో వాటర్ బౌజర్ 14 వేల లీటర్ల నీటిని తరలించే సామర్థ్యం కలిగి ఉంటాయని... పట్టణ, పారిశ్రామిక ప్రాంతాల్లో మంటలను అదుపు చేయడంలో ఇవి కీలకంగా వ్యవహరిస్తాయని తెలిపారు. ఇరుకైన, రద్దీగా ఉండే ప్రాంతాల్లోనూ వేగంగా చేరుకునేలా రూ.6.37 కోట్ల విలువైన 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ ఫైర్ ఫైటింగ్ వాహనాలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించినట్టు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మొత్తం



రూ.252.86 కోట్ల వ్యయంతో దశలవారీగా ఆధునిక వాహనాలు, పరికరాలను సమకూరుస్తున్నాం. తొలిదశలో రూ.33 కోట్ల వ్యయంతో 65 అగ్నిమాపక వాహనాలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చాం. రెండో దశలో రూ.40 కోట్లతో 58 వాహనాలను ఇప్పుడే ప్రారంభించుకున్నాం. ఇక త్వరలో మూడో దశలోనూ మరిన్ని అగ్నిమాపక వాహనాలు, ఫైర్ ఫైటింగ్ పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నాం. వీటితో పాటు ఫైర్ స్టేషన్లల్లో మౌలిక వసతులపైనా ప్రత్యేక దృష్టి సారించాం. రాష్ట్రంలో 17 కొత్త ఫైర్ స్టేషన్ భవనాల నిర్మాణం జరుగుతుండగా, ఒక్కో భవనానికి రూ.2.25 కోట్ల చొప్పున ఖర్చు పెడుతున్నాం. వీటిలో ఆరు భవనాల నిర్మాణం పూర్తయింది. మరో 36 ఫైర్ స్టేషన్లను ఆధునీకరిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా అగ్నిమాపక సేవల మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి అనిత, అగ్నిమాపక శాఖ డీజీ వెంకటరమణ సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# "మీ అభివృద్ధి కోసం నిలబడుతా

మొదటి పేజి తరువాయి

సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కోర్ అర్బన్ #CURE ప్రాంత పరిధిలో హైదరాబాద్ కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ ఇండ్లు (టవర్స్) నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శ్రీధర్ బాబు , పొన్నం ప్రభాకర్ గారితో పాటు ప్రజాప్రతినిధుల సమక్షంలో భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, నిషేధిత జాబితాలో పెట్టిన భూముల సమస్యను ప్రస్తావించారు. "ఏదైనా కారణంగా మీ భూమి 22 ఏ లో చేరి ఉంటే, కొనుగోలు చేసిన హక్కుదారుల స్థలాలు ఎక్కడికీ పోవు. నేను హామీ ఇస్తున్నా. కోర్టు కేసుల్లో ఉన్న భూములకు సంబంధించి సర్వే నంబర్‌లో వచ్చిన మొత్తం భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. కోర్టు కేసులున్న స్థలాల వరకు పక్కనపెట్టి మిగతా వాటికి బైనెంబర్లు ఇచ్చి పరిష్కరిస్తున్నారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.." అని ముఖ్యమంత్రి గారు స్పష్టం చేశారు. "కూకట్‌పల్లి ప్రాంత ప్రజలకు ఏం కావాలన్నా పనులు చేయించుకోండి. ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకునే అవకాశం వచ్చింది. ఈ ప్రాంతంలో రోడ్లు, ఫ్లైఓవర్లు, చెరువుల పునరుద్ధరణ, విద్య కోసం పాఠశాలలు, కాలేజీలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం అవసరమున్న పరిశ్రమల విషయంలోనైనా నియోజకవర్గాన్ని ప్రత్యేకంగా చూడాలి" అని ముఖ్యమంత్రి వేదికపైనున్న మంత్రి శ్రీధర్ బాబు కి సూచించారు. "అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు విషయంలో ప్రజలు కూడా గత పాలనను, ఈ రెండేళ్ల పాలనను బేరీజు వేసుకోవాలి. గత ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వేటినీ నిలిపివేయలేదు. అదనంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం" అని సంక్షేమ పథకాలను వివరించారు. "రాష్ట్రంలో 3.28 కోట్ల మంది ప్రజలకు ప్రతి వ్యక్తికి ఒక్కొక్కరికి 6



కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తున్నాం. 200 యూనిట్లు ఉచిత కరెంట్ ఇస్తున్నాం. రూ. 500 లకే సిలిండర్ అందజేస్తున్నాం. కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశాం. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఉద్యోగ, ఉపాధి కోసం చదువుల కోసం వెళ్లేవారు నెలకు ఆరేడు వేలు ఆదా చేసుకుంటున్నారు. ఇప్పటికే ఆర్టీసీకి 12 వేల కోట్లు చెల్లించాం. స్వయం సహాయక సంఘాలు 65 వేల కోట్ల బ్యాంకు లింకేజీ ఇచ్చి రూ. 2500 కోట్ల వడ్డీ చెల్లించాం. మహిళా సంఘాల పేరిట వెయ్యి బస్సులు కొనిచ్చి ఆర్టీసీకి అద్దెకిప్పించాం. వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటుకు అవకాశం కల్పించాం. ఆదిలాబాద్ అడవుల నుంచి అచ్చంపేట వరకు ఆడబిడ్డలు తయారు చేసిన వస్తువులను విక్రయించుకోవడానికి శిల్పారామంలో మూడున్నర ఎకరాల్లో ఇందిరా మహిళా బజార్ల ఏర్పాటుకు విలువైన స్థలమిచ్చాం. రెండేండ్లు తిరిగేలోపు ప్రభుత్వానికి సంబంధించి అన్ని శాఖల్లో రెండేళ్లు తిరిగేలోపు 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. కూకట్‌పల్లిలో వందల కోట్ల విలువ చేసే 11 ఎకరాల భూమిలో మంచి సంకల్పంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మించే అద్భుతమైన కార్యక్రమం చేపట్టాం. నగరంలో నిరుపేదలు ఎవరు ఎక్కడ నివసిస్తున్నారో వారికి అక్కడే ఇండ్లు ఇవ్వాలని సంకల్పించాం. పేదల కోసం నిర్మించే ఇండ్లకయ్యే రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా రద్దు చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మంత్రులకు సూచించారు. ఇప్పుడు నిర్మించే ఇళ్లకు సంబంధించి నిరుపేదలకు స్థలం మొత్తం ఉచితంగా అందిస్తున్నాం. నిర్మాణానికి అయ్యే వ్యయంలో ఐదారు లక్షలు లబ్ధిదారులు భరిస్తే నిర్మాణం జరుగుతున్నప్పుడు ఎలా సాగుతుందో ఎప్పుడైనా పరిశీలించే హక్కుదారులవుతారు" అని వివరించారు. "నిరుపేదలు ఉండడానికి సొంత ఇళ్లు ఇవ్వాలన్న ఆలోచనతో ముందుకు వెళుతున్నాం. సొంతింటి కల నెరవేరడానికి నూటికి నూరు శాతం అండగా నిలబడుతాం. మొదటి విడతగా కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్, కంటోన్మెంట్, ఎల్బీనగర్, ఉప్పల్ లాంటి అత్యధికంగా పేదలు ఉండే ప్రాంతాలు, ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల నుండి పనులు చేయడానికి ఇక్కడికి వలసలు వచ్చిన ప్రాంతాల్లో ఉండటానికి మంచి ఇల్లు ఇవ్వడానికి ఈ ప్రభుత్వం కృషి చేస్తోంది. గతంలో ఏదైనా పని చేయాలంటే గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్.. ఇలా తిరగడానికే సమయం సరిపోయేది. అందుకే ప్రజల సౌలభ్యం కోసం సైబరాబాద్ కమిషనరేట్‌ను ఏర్పాటు చేశాం" అని చెప్పారు. "మీ అభివృద్ధి కోసం నిలబడుతా. పది మందికి మేలు చేయాలన్న ఆలోచన నాకుంది. మంచి చేయడానికి చిత్తశుద్ధి కావాలి. మంచి ఆలోచన కావాలి. విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపించడానికి రోజుకు 18 గంటలు పనిచేయడానికి దేవుడు శక్తినిచ్చారు. అందుకు ప్రజలు.. మీరూ ఆశీర్వదించండి" అని ముఖ్యమంత్రి గారు కోరారు.

## రాష్ట్రంలోని 130 జలాశయాల్లో
## పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుపై అధ్యయనం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను ఇంధన రంగంలో అగ్రగామిగా నిలబెట్టే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని 130 జలాశయాల్లో పంప్డ్ స్టోరేజ్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు గల అవకాశాలు, సాధ్యసాధ్యాలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం ఇంధన శాఖ పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ దిశానిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టు వద్ద పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు ఏర్పాటు ప్రతిపాదనపై చర్చిస్తూ, రాష్ట్రంలోని ఇతర జలాశయాల వద్ద కూడా ఇలాంటి ప్రాజెక్టుల ఆర్థిక సాధ్యతపై నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా జలాశయాల నుంచి విద్యుదుత్పత్తికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ ఉత్పత్తి కొనసాగేలా ముందుగానే అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పారిశ్రామికీకరణ వేగవంతం అవుతున్నందున, ప్రతి ఆరేళ్లకు విద్యుత్ వినియోగం రెట్టింపు అయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. పెరుగుతున్న ఈ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని, తక్కువ ధరకే విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అదే సమయంలో విద్యుత్ పంపిణీ నష్టాలను మరింత తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సౌర విద్యుత్ ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 'పీఎం సూర్య ఘర్' పథకం కింద సెప్టెంబర్ నాటికి 6 లక్షల సోలార్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ పథకం కిందకు రాని మరో మూడు లక్షల కనెక్షన్లను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. దీంతోపాటు, మరో 10 లక్షల కనెక్షన్ల కోసం కేంద్రానికి దరఖాస్తు చేయాలని అధికారులకు సూచించారు. 'పీఎం-కుసుమ్' పథకం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయడంతో పాటు, అదనంగా 2,000 మెగావాట్ల సామర్థ్యం కోసం కేంద్రాన్ని అభ్యర్థించాలని తెలిపారు. తక్కువ ఖర్చుతో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసే వ్యవస్థను రూపొందించేందుకు సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్ వనరులను అనుసంధానం చేయాల్సిన అవసరాన్ని చంద్రబాబు నొక్కిచెప్పారు. ఈ ఏడాది సగటు విద్యుత్ కొనుగోలు ఖర్చును యూనిట్‌కు రూ. 4.60కి, 2029 నాటికి రూ. 4కి తగ్గించాలని స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. రాష్ట్రంలోని ఆరు విద్యుత్ సంస్థల (యుటిలిటీల) పనితీరును మెరుగుపరిచేందుకు 'పనితీరు ఆధారిత రేటింగ్' విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించారు. ప్రతి సంస్థకు స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి, అగ్రశ్రేణి కార్పొరేట్ సంస్థలతో పోటీపడేలా వాటిని తీర్చిదిద్దాలని అన్నారు. ఈ సందర్భంగా, విద్యుత్ కొనుగోళ్లలో ఆప్టిమైజేషన్ ద్వారా రూ. 234 కోట్లు ఆదా అయినట్లు, సకాలంలో చెల్లింపులు చేయడం వల్ల రిబేట్ల రూపంలో మరో రూ. 100 కోట్లు ఆదా అయినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

## నామి'లేట్'డ్ పదవులు ఎప్పుడు?

హైదరాబాద్: నామినేటెడ్ పోస్టుల భర్తీ ఎప్పుడనేది అధికార కాంగ్రెస్ పార్టీ నేతల్లో గుబులు పుట్టిస్తోంది. ముఖ్యంగా గత నెలలో పదవీకాలం పూర్తయిన కార్పొరేషన్ చైర్మన్లు, ఇప్పటి వరకు భర్తీ చేయని కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఎప్పుడు ప్రకటిస్తారనే విషయంలో కంగాళీ ఏర్పడింది. అసలు ఈ పోస్టుల భర్తీ ఉంటుందా ? ఉంటే ఎప్పుడు? ప్రాతిపదికలేమిటి? గతంలో పనిచేసిన వారికి మళ్లీ అవకాశమిస్తారా? పూర్తిగా కొత్త వారిని నియమిస్తారా? తదితర ప్రశ్నలు కాంగ్రెస్ నేతలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశాల అనంతరం ఆగస్టులో పార్టీ పదవులు భర్తీ చేసి, సెప్టెంబర్‌లో నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని ప్రకటించినా, ఆశావహుల్లో మాత్రం సందేహాలు వెంటాడుతూనే ఉన్నాయి. అసలు ఇప్పట్లో కార్పొరేషన్ చైర్మన్ పదవులు భర్తీ చేసేది లేదని ఓ ముఖ్య నేత ఇటీవల బహిరంగంగానే వ్యాఖ్యానించడం ఈ కంగాళీకి కారణమవుతోంది. అయితే, సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 19నుంచి విదేశీ పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో ఈలోపే కొన్ని నామినేటెడ్ పోస్టులను ప్రకటిస్తారనే చర్చ ఆశావహులకు కొంత ఊరటనిస్తున్నా అది జరుగుతుందా లేదా అనే మీమాంస మాత్రం వారిని వెంటాడుతుండడం గమనార్హం. అవకాశం ఎదురుచూస్తున్న వారి జాబితా చాంతాడంత కనిపిస్తోంది. కొత్తగా అవకాశం కోసం ఎదురుచూస్తున్న నేతలే ఉమ్మడి జిల్లాకు ఓ 20 మందికి తగ్గకుండా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. పిడమర్తి రవి, నాగా సీతారాములు, సాధు రమేశ్‌రెడ్డి, వక్కలగడ్డ చంద్రశేఖర్, కమర్థపు మురళి (ఖమ్మం), గౌరి సతీష్, అయిల్ల శ్రీనివాస్‌గౌడ్ (రంగారెడ్డి), సీఎన్‌రెడ్డి, పల్లె లక్ష్మణ్‌కుమార్, బొల్లు కిషన్ (హైదరాబాద్), కొక్కిరాల విశ్వప్రసాద్ , దుర్గం భాస్కర్, రేఖానాయక్, పురాణం సతీశ్‌కుమార్ (ఆదిలాబాద్), వినయ్‌రెడ్డి, మార చంద్రమోహన్‌రెడ్డి, ఏబీ శ్రీనివాస్, మునిపల్లి సాయారెడ్డి, అరికెల నర్సారెడ్డి (నిజామాబాద్), కర్ల సత్యప్రసన్నరెడ్డి, ఆకారపు భాస్కర్‌రెడ్డి, ఊట్కూరు నరేందర్‌రెడ్డి (కరీంనగర్), పున్నా కైలాష్ నేత, కొండేటి మల్లయ్య, గుమ్ముల మోహన్‌రెడ్డి, లక్ష్మి నారాయణరెడ్డి, చనగాని దయాకర్ (నల్లగొండ), ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, ఈవీ శ్రీనివాస్, ఐత ప్రకాశ్‌రెడ్డి, కొనగాల మహేశ్ (కరీంనగర్)ల పేర్లు ఈ జాబితాలో ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరితో పాటు మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గతంలో పార్టీ అధ్యక్షులుగా పనిచేసిన వారు కలిపి ప్రతి జిల్లాలో 20 మందికి తగ్గకుండా ఆశావహులు కనిపిస్తున్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన తెలంగాణ ముఖ్య నేతల భేటీ అనంతరం గాంధీభవన్ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. గతంలో నామినేటెడ్ పదవులతో సహా ఎలాంటి కీలక విషయంలోనైనా సీఎం, టీపీసీసీ చీఫ్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జులు నిర్ణయం తీసుకునే ఆనవాయితీ కాంగ్రెస్ పార్టీలో ఉంది. అయితే, ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశంలో టీపీసీసీ సమన్వయ కమిటీలో చర్చించిన తర్వాతే పదవుల భర్తీపై తుది నిర్ణయానికి రావాలని రాష్ట్ర పార్టీ నాయకత్వానికి అధిష్టానం స్పష్టం చేసిందని తెలుస్తోంది.

## ప్రత్యేక భద్రతా ఫీచర్లు ..
## క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ ధ్రువీకరణ





హైదరాబాద్: ప్రజా పంపిణీ వ్యవస్థలో లబ్ధిదారుల గుర్తింపును మరింత పటిష్టం చేయడంతోపాటు నకిలీ రేషన్ కార్డులకు అడ్డుకట్ట వేసేలా తెలంగాణ ప్రభుత్వం కొత్త ఫుడ్ సెక్యూరిటీ కార్డు (స్మార్ట్ రేషన్‌కార్డు)లో పలు భద్రతా ఫీచర్లను పొందుపరిచింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం సంగారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కొత్త స్మార్ట్ రేషన్‌కార్డులను అందజేసే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్డులో కనిపించే భద్రతా అంశాలతోపాటు సాధారణంగా గుర్తించలేని రహస్య భద్రతా గుర్తులు, స్పర్శ ద్వారా గుర్తించే సాంకేతికత, డిజిటల్ ధ్రువీకరణ వంటి పద్ధతులను కార్డులో వినియోగించారు. కార్డుపై తెలంగాణ ప్రభుత్వ చిహ్నంతో కూడిన హోలోగ్రామ్‌ను ముద్రించారు. అలాగే జారీ చేసే అధికారి అయిన పౌరసరఫరాల కమిషనర్ అధికారిక సంతకాన్ని కూడా కార్డులో పొందుపరిచారు. దీంతో కార్డు ప్రామాణికతను నిర్ధారించడం, నకిలీ కార్డుల తయారీని అడ్డుకోవడం, ప్రజా పంపిణీ వ్యవస్థలో లబ్ధిదారుల గుర్తింపును బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. 'గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ'అనే పదాలను ఉబ్బెత్తుగా ముద్రించారు. చేతితో తడిమినప్పుడు ఈ అక్షరాలు స్పష్టంగా తెలుస్తాయి. అలాగే కార్డులో మైక్రో ప్రింటెడ్ టెక్స్ట్‌ను కూడా ఉపయోగించారు. అతి చిన్న పరిమాణంలో ఉండే ఈ అక్షరాలు సాధారణంగా కంటికి స్పష్టంగా కనిపించవు. పెద్దదిగా పరిశీలించినప్పుడు మాత్రమే చదవగలిగేలా ఉంటాయి. సాధారణ ప్రింటర్లతో నకిలీ చేయడం కష్టంగా ఉండటంతో ఇది యాంటీ--కాపీ భద్రతా అంశంగా పనిచేస్తుంది.'గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ', 'ఒరిజినల్'వంటి అక్షరాలతో ద్వంద్వ రహస్య చిత్రాలను పొందుపరిచారు. నిర్దిష్ట కోణంలో చూసినప్పుడు లేదా పెద్దదిగా పరిశీలించినప్పుడు మాత్రమే ఇవి కనిపిస్తాయి. కార్డు అసలైనదో కాదో నిర్ధారించేందుకు నిపుణులకు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. అలాగే తెలంగాణ ప్రభుత్వ చిహ్నంతో వాటర్‌మార్క్‌ను కార్డులో పొందుపరిచారు. కార్డును వెలుతురుకు ఎదురుగా ఉంచినప్పుడు ఈ గుర్తు కనిపిస్తుంది. ప్రభుత్వ పత్రాల్లో సాధారణంగా ఉపయోగించే బలమైన ధ్రువీకరణ భద్రతా విధానాల్లో ఇది ఒకటి. అలాగే సాధారణ వెలుతురులో కనిపించని తెలంగాణ ప్రభుత్వ చిహ్నాన్ని అతినీలలోహిత (యూవీ) కాంతిలో కనిపించేలా ప్రత్యేక సిరాతో ముద్రించారు. యూవీ కాంతి కింద ఈ గుర్తు వెలుగుతుంది. దీంతో రహస్యంగా కార్డును తనిఖీ చేయడంతోపాటు యంత్రాల ద్వారా కూడా వేగంగా ధ్రువీకరించవచ్చు. ఫుడ్ సెక్యూరిటీ కార్డులో లబ్ధిదారుల వివరాలను భద్రంగా ధ్రువీకరించేలా ఎన్‌క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. అదీకృత సాఫ్ట్‌వేర్ లేదా స్కానింగ్ వ్యవస్థల ద్వారా మాత్రమే ఇందులోని సమాచారాన్ని ధ్రువీకరించేలా రూపొందించారు. కార్డుకు సంబంధించిన సీరియల్ నంబర్ తదితర డిజిటల్ సమాచారాన్ని ఇందులో భద్రపరచవచ్చు. ఆదీకృత వ్యవస్థ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసినప్పుడు మాత్రమే వివరాలను ధ్రువీకరించే అవకాశం ఉంటుంది.

## ప్రాధాన్యతా క్రమంలో 36 ప్రాజెక్టులు
## పూర్తి చేయాలని నిర్ణయం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ సహా రాష్ట్రంలోని ప్రాధాన్యతా ప్రాజెక్టుల పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల వారీగా జరుగుతున్న పనుల వివరాలను జలవనరుల శాఖ అధికారులు ఆయనకు నివేదించారు. పోలవరం ప్రాజెక్టులో నిన్నటి వరకు 89.9 శాతం సివిల్ పనులు పూర్తయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఎడమ కాలువ పనులు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయని, ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ గ్యాప్-1, గ్యాప్-2 పనులను శరవేగంగా చేపట్టినట్టు తెలిపారు. ఇటీవల 14 లక్షల క్యూసెక్కుల భారీ వరద ప్రవాహం వచ్చినప్పటికీ, పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా కొనసాగించామని నివేదికలో పేర్కొన్నారు. పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, పలు కీలక సూచనలు చేశారు. డ్యామ్ సైట్ వద్ద రోడ్ల వంటి మౌలిక వసతుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా, ప్రాజెక్టు సమీపంలోని గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ, స్థానికుల మనోభావాలను గౌరవించేలా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మొత్తం 36 ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయడంపై చర్చించారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు, లోటు వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి సరఫరా, జలధార-జలహారతి కార్యక్రమాల అమలు వంటి అనేక కీలక అంశాలపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# యాచారంలో ఘనంగా తిరంగా ర్యాలీ

## దేశభక్తి, జాతీయ ఐక్యతకు ప్రతీకగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం



**యాచారం, ఆగస్ట్ 14,(జనం వాయిస్ ):** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు,"హర్ ఘర్ తిరంగా" ర్యాలీ బీజేపీ అధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది... ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి కొప్పు భాష, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరిపెల్లి అంజయ్య పాల్గొని మాట్లాడుతూ.. 80 సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవ ఉత్సవాలని పురస్కరించుకొని దేశ ప్రజలు ప్రతి ఒక్కరూ ఇంటిపైన జాతీయ జెండాను ఎగరవేసి మన దేశ ఐక్యతను చాటుదామని తెలియజేయడం జరిగింది... ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా సాహకోశాధికారి తాంద్ర రవీందర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు నాగని యాదయ్య, ఓబిసి మోర్చా రాష్ట్ర నాయకులు గోగికర్ రమేష్, ఓబీసీ మోర్చా రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు అంబోజి జగదీష్, మొండి గౌరెల్లి సర్పంచ్ కొలను రమాదేవి మల్లారెడ్డి,చింతుల్ల సర్పంచ్ ఆంబోజి రమేష్, తాడిపర్తి సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్,బీజేవైఎం అధికార ప్రతినిధి వనవాడ రవీందర్ రెడ్డి,బిజెపి మండల ప్రధాన కార్యదర్శులు కొండాపురం నాగరాజు, కుంచారం సందీప్ రెడ్డి, ఉపాధ్యక్షులు పల్లపు నరేష్, కడారి జంగయ్య గారు, బొడ్డు భాషయ్య, ఉపసర్పంచ్లు గౌర లక్ష్మణ్, గౌర నాగరాజు, రవీందర్ , బిజెపి నాయకులు నాయిని పాండురంగారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సంతోష్ గుప్తా, నారిమల రమేష్,పత్తి రాజు, సాటు మల్లేష్,ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు పెరుమాళ్ళ విక్రమ్, పల్లపు రవీందర్, శ్రీకాంత్ రెడ్డి,బన్నే శివ,బూర సందీప్, కానుగుల కృష్ణ , బిజెపి నాయకులు మరియు వివిధ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.



# మల్కిజ్‌గూడలో రేకుల షెడ్డు ధ్వంసం

**యాచారం, ఆగస్ట్ 14,(జనం వాయిస్ ):** మండలంలోని మల్కిజ్ గూడ గ్రామ పంచాయతీ పరిధిలో ని గ్రామ కంఠం భూమిలో పంచాయతీ అధికారిక తీర్మానంతో నిర్మించిన రేకుల షెడ్డును గుర్తుతెలియని వ్యక్తులు రాత్రికి రాత్రే ధ్వంసం చేసిన సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.గ్రామ కంఠం ఆస్తులపై దాడి చేసిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు, కోరుతున్నారు.

# స్వచ్ఛమైన భారత్-- ఆరోగ్యకరమైన భారత్ కోసం విద్యార్థులకు పిలుపునిచ్చిన వలస సుభాష్ వ్యవస్థాపక అధ్యక్షులు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ




**జనం వాయిస్ అక్కన్న పేట ఆగస్టు 14:** గౌరవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మేరా యువభారత్ (మైభారత్ ) మరియు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్షవాడ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు ఒకటో తారీకు నుండి 15 వరకు సిద్దిపేట జిల్లా స్థాయి స్వచ్ఛత పక్షవాడ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది ఈ సందర్భంగా సంకల్ప స్వచ్ఛందంగా సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వలస సుభాష్ విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడుతూ మహాత్మా గాంధీ జి స్వచ్ఛ తో పాటు పరిశుభ్రమైన అభివృద్ధి చెందిన భారతదేశాన్ని కలగన్నారు భరతమాతను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దేశానికి సేవ చేయడం మనందరి బాధ్యత అని విద్యార్థులతో అన్నారు నేను పరిశుభ్రత పట్ల ఎల్లప్పుడు నిబద్ధతతో ఉంటాన నేను పరిశుభ్రతతో కోసం నా సమయాన్ని కేటాయిస్తానని ప్రతిజ్ఞ చేసినట్టు ఆయన విద్యార్థులతో తెలిపారు స్వచ్ఛమైన పరిసరాలు ఆరోగ్యానికి మన సమాజానికి మన దేశ అభివృద్ధికి ఎంతో ముఖ్యమని విద్యార్థులతో అన్నారు గ్రామాలు పట్టణాలు మరియు నగరాలు స్వచ్ఛ భారత్ మిషన్ సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన విద్యార్థితో అన్నారు ప్రతి విద్యార్థి పరిశుభ్రత కోసం నేను సైతం అంటూ ముందడుగు వేస్తూ భారతదేశాన్ని మరింత పరిశుభ్రమైన దేశంలో మార్చేందుకు విద్యార్థులు కృషి చేయాలని వారితో అన్నారు స్వచ్ఛత కార్యక్రమములో యువజన సంఘాలు మహిళా సంఘాలు యువత విద్యార్థులు స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ శాఖలు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలని ఆయన వేడుకున్నారు తదనంతరం గౌరవెల్లి పాఠశాలలో జిల్లాస్థాయిలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ ప్రధాన చార్యులు ఏ జ్యోతి గారిని శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఏ జ్యోతి ఫిజికల్ డైరెక్టర్ జంగాపల్లి వెంకట నరస య్య రామన్ బాబు శ్రీనివాస్ శ్రీనివాస్ కృష్ణకుమారి నాశ్రీన్ రమాదేవి విద్యార్థులు పాల్గొన్నారు.

# డా. పాలు శంకర్‌కు అంతర్జాతీయ అవార్డు

- క్రీడా, సామాజిక సేవకు గుర్తింపు
- 'ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్' పురస్కారం
- క్రీడారంగంలో శంకర్‌కు ప్రత్యేక గుర్తింపు
- తోటపల్లి వాసికి అంతర్జాతీయ పురస్కారం




**జనం వాయిస్.హుస్నాబాద్ ఆగస్టు 14:** తోటపల్లి గ్రామానికి చెందిన డా. పొలు శంకర్ సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు క్రీడారంగంలో చేసిన విశేష కృషికి ప్రతిష్ఠాత్మక "ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డ్స్--2026" పురస్కారాన్ని అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆగస్టు 14న హైదరాబాద్ కింగ్‌కోటిలోని తెలంగాణ సరస్వత పరిషత్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. "బెస్ట్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అచీవర్స్ అవార్డు" కేటగిరీలో డా. పొలు శంకర్‌కు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. తోటపల్లి గ్రామం నుంచి క్రీడారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన డా. పొలు శంకర్ సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటున్నారు. క్రీడలు, సేవా కార్యక్రమాల ద్వారా యువతలో ఆరోగ్యం, క్రమశిక్షణ, సేవాభావం, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా డా. పొలు శంకర్ మాట్లాడుతూ తన కృషిని గుర్తించి ప్రతిష్ఠాత్మక అవార్డుతో సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యత పెంచిందని, భవిష్యత్తులో క్రీడారంగంతో పాటు సామాజిక సేవలో మరింతగా పనిచేసి ప్రజలకు, యువతకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. డా. పొలు శంకర్‌కు అంతర్జాతీయ స్థాయి పురస్కారం లభించడంపై తోటపల్లి గ్రామస్థులు, క్రీడాకారులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# పిల్లిగుండ్ల తండలో విషాదం.. తల్లీకుమారుడు మృతి

## గేదెలను మేపేందుకు వెళ్లి కుంటలో పడి మృతి

## ఘటనపై సమగ్ర విచారణకు డిమాండ్



**కురవి, ఆగస్టు 14 (జనం వాయిస్):** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం పిల్లిగుండ్ల తండ గ్రామ శివారులో గురువారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మొగిలిచర్ల రెడ్డి కుంటలో పడి తల్లి, కుమారుడు మృతి చెందారు. పిల్లిగుండ్ల తండాకు చెందిన భూక్య నవ్య (26), ఆమె కుమారుడు అన్వేష్ (9) మృతి చెందడంతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. నవ్య, అశోక్ దంపతులకు కుమార్తె నిహారిక, కుమారుడు అన్వేష్ ఉన్నారు. గురువారం అశోక్ పనిమీద హైదరాబాద్‌కు వెళ్లగా, నవ్య తన కుమారుడు అన్వేష్‌తో కలిసి గేదెలను మేపేందుకు తండా సమీపంలోని కుంట వైపు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సాయంత్రమైనా తల్లి, కుమారుడు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, తండావాసులు ఆందోళనకు గురై వెతకడం ప్రారంభించారు. కుంట వద్దకు వెళ్లి పరిశీలించగా సెల్‌ఫోన్ రింగ్ అవుతున్నట్లు గుర్తించారు. అక్కడే ఫోన్ ఉండగా, సమీపంలో బాలుడి దుస్తులు, చెప్పులు కనిపించడంతో కుంటలో గాలించారు. అనంతరం తల్లీకుమారుడు కుంటలో మృతి చెందినట్లు గుర్తించి మృతదేహాలను వెలికితీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఘటనకు గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

### గొడవల నేపథ్యంలో అనుమానాలు..

భార్యాభర్తల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నట్లు తండాలో చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో సమగ్ర విచారణ చేయాలని స్థానికులు కోరుతున్నారు. తల్లి, కుమారుడు ప్రమాదవశాత్తు కుంటలో పడ్డారా? లేక మరేదైనా కారణం ఉందా? అనే అంశాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. భార్య, కుమారుడిని కోల్పోవడంతో అశోక్‌తో పాటు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన తల్లి, కుమారుడు మృతి చెందడం తండావాసులను తీవ్రంగా కలచివేసింది.

# దివ్యాంగులకు ఉచితంగా సహాయ ఉపకరణాల పంపిణీకి ప్రత్యేక నిర్ధారణ శిబిరం

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.

## ఆగస్టు 17న గోదావరిఖనిలోని ఆర్‌జీ-1 సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో శిబిరం.

## రామగుండం, పాలకుర్తి, అంతర్గాం ప్రాంతాల దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి.



**జనం వాయిస్, పెద్దపల్లి, ఆగస్టు 14:** రామగుండం నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఉచితంగా సహాయ ఉపకరణాలు అందించేందుకు అలింకో సంస్థ సహకారంతో ప్రత్యేక నిర్ధారణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 17, 2026న ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు గోదావరిఖనిలోని ఆర్‌జీ-1 సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రామగుండం, పాలకుర్తి, అంతర్గాం ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు మాత్రమే ఈ శిబిరానికి హాజరుకావాలని సూచించారు. శారీరక దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిల్, మూడు చక్రాల రిక్షా, వీల్‌చైర్, చంక కర్రలు, చేతి కర్రలు తదితర సహాయ ఉపకరణాలను అందించనున్నట్లు తెలిపారు. బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిల్ పొందేందుకు కనీసం 80 శాతం శారీరక వైకల్యం కలిగి, కాళ్లకు తీవ్రమైన వైకల్యం ఉండి, చేతులు సాధారణంగా పనిచేసే దివ్యాంగులు అర్హులని పేర్కొన్నారు. బధిరులకు హియరింగ్ ఎయిడ్స్, అంధులకు ప్రత్యేక మొబైల్ ఫోన్లు, చేతి కర్రలు, మానసిక దివ్యాంగులకు ప్రత్యేక కిట్లు తదితర సహాయ ఉపకరణాలను అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇతర సహాయ ఉపకరణాలు పొందేందుకు కనీసం 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం కలిగి ఉండాలని పేర్కొన్నారు. శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులు సదరం వైద్య ధ్రువీకరణ పత్రం లేదా జిల్లా మెడికల్ బోర్డు/అప్పిలేట్ మెడికల్ బోర్డు జారీ చేసిన వైద్య ధ్రువీకరణ పత్రం, యూడీఐడీ కార్డు లేదా యూడీఐడీ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న రసీదు, ఆధార్ కార్డు, ఇటీవల పొందిన ఆదాయ ధ్రువీకరణ పత్రం జిరాక్స్ ప్రతులను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2.50 లక్షలకు మించకూడదని, దరఖాస్తుదారుల వయస్సు 16 సంవత్సరాల కంటే తక్కువ ఉండకూడదని తెలిపారు. వైకల్యం స్పష్టంగా కనిపించే ఫొటోలను కూడా తీసుకురావాలని సూచించారు. యూడీఐడీ కార్డు లేని దివ్యాంగులు ద్వారా ఆన్‌లైన్‌లో (https://www.swavlambancard.gov.in/?utm_source=chat-gpt.com) దరఖాస్తు చేసుకుని, దరఖాస్తు రసీదును శిబిరానికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. గత మూడు సంవత్సరాల్లో శాఖ ద్వారా ఇదే రకమైన సహాయ ఉపకరణాలు పొందిన వారికి ఈ శిబిరంలో ప్రాధాన్యత ఇవ్వబడదని స్పష్టం చేశారు. అర్హత కలిగిన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు. మరిన్ని వివరాలకు 9440852495, 9550796597 నంబర్లలో సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# గౌరవెల్లి భూనిర్వాసితుల పేరుతో చాడ వెంకట్‌రెడ్డి రాజకీయ డ్రామా

## పైడిపెల్లి పృథ్విరాజ్ గౌడ్ బీజేపీ సిద్ధిపేట జిల్లా కార్యదర్శి

## కాంగ్రెస్--సీపీఐ కూటమి రాష్ట్ర ప్రభుత్వంలో కొనసాగుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమై, అదే సమస్యలను రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకోవడం విడ్డూరంగా ఉందని బీజేపీ సిద్ధిపేట జిల్లా కార్యదర్శి పైడిపెల్లి పృథ్విరాజ్ గౌడ్ విమర్శించారు.



**జనం వాయిస్. హుస్నాబాద్ ఆగస్టు 14:** గౌరవెల్లి భూనిర్వాసితులకు వెంటనే పరిహారం చెల్లించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేయడం చూస్తుంటే, ప్రజల సమస్యలపై నిజంగా చిత్తశుద్ధి ఉందా? లేక రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు ఆందోళనల పేరుతో హడావుడి చేస్తున్నారా? అనే ప్రశ్న ప్రజల్లో తలెత్తుతోందన్నారు. భూనిర్వాసితులకు న్యాయం జరగాలన్నది అందరి ఆకాంక్ష అని, అర్హులైన ప్రతి కుటుంబానికి చట్టబద్ధంగా రావాల్సిన పరిహారం అందించాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన సీపీఐ నాయకులు, ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా కేవలం రాజకీయ ప్రచారానికి పరిమితం కావడం ప్రజలకు ఉపయోగపడదన్నారు. కాంగ్రెస్--సీపీఐ కూటమిగా కొనసాగుతూ, గతంలో కూడా బీఆర్ఎస్‌తో కలిసి పేద ప్రజల సమస్యలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకున్నారని ఆయన ఆరోపించారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని చెబుతూ ప్రభుత్వ భూముల వద్దకు ప్రజలను తీసుకెళ్లి రాజకీయ ప్రచారం చేయడం తప్ప, వారికి శాశ్వత పరిష్కారం చూపించడంలో విఫలమయ్యారని విమర్శించారు. బీజేపీ వైఖరి స్పష్టం --- భూనిర్వాసితులకు న్యాయం జరగాలి. అర్హులైన ప్రతి కుటుంబానికి చట్టబద్ధంగా రావాల్సిన పరిహారం అందాలి. పెండింగ్‌లో ఉన్న అంశాలను ప్రభుత్వం పారదర్శకంగా పరిశీలించి, కాలపరిమితితో పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజల కష్టాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం నిజమైన ప్రజా పోరాటం కాదని, ప్రజల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడమే నిజమైన ప్రజా సేవ అని అన్నారు. సీపీఐ నాయకులు నిజంగా భూనిర్వాసితుల పక్షాన ఉంటే, ఎంతమంది అర్హులైన లబ్ధిదారులు ఉన్నారు? ఎంత పరిహారం చెల్లించారు? ఇంకా ఎంత పెండింగ్‌లో ఉంది? ఎందుకు పెండింగ్‌లో ఉంది? అనే వివరాలను ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. బీజేపీపై రాజకీయ ఆరోపణలు చేయడం, ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని హితవు పలికారు. బీజేపీ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడుతుందని, ప్రజల హక్కుల కోసం ప్రశ్నిస్తుందని, సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలబెడుతుందని తెలిపారు. ప్రజల సమస్యల పేరుతో రాజకీయ మైలేజ్ కోసం చేసే కార్యక్రమాలకు, ప్రజల సమస్య పరిష్కారం కోసం చేసే నిజమైన పోరాటానికి ఎంతో తేడా ఉందని, ఆ తేడాను గౌరవెల్లి ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా కేంద్ర ప్రభుత్వాన్ని నిందించడం సరికాదని, ముందుగా రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తించి భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని పైడిపెల్లి పృథ్విరాజ్ గౌడ్ హెచ్చరించారు.

# సేవాభావానికి దక్కిన రాజకీయ బాధ్యత..!

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సమ్మయ్య గౌడ్‌కు కేజీకేఎస్ మండల కమిటీ ఘన సన్మానం




**మహబూబాబాద్, ఆగస్టు 14 (జనం వాయిస్) :** కాంగ్రెస్ పార్టీ కేసముద్రం మండల అధ్యక్షుడిగా చిలువేరు సమ్మయ్య గౌడ్ నియమితులైన సందర్భంగా కేజీకేఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేజీకేఎస్ మండల కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. సమ్మయ్య గౌడ్ గత కొంతకాలంగా ప్రజాసేవలో చురుకుగా ఉంటూ పేదలు, నిరుపేదలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని పేర్కొన్నారు. సేవాభావంతో ప్రజలకు అండగా నిలిచే వ్యక్తికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం అభినందనీయమన్నారు. "పదవి కోసం ప్రజాసేవ కాదు.. ప్రజాసేవకు పదవి" అనే విధంగా సమ్మయ్య గౌడ్ తన బాధ్యతలను నిర్వర్తించాలని కమిటీ ఆకాంక్షించింది. మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. భవిష్యత్తులో సమ్మయ్య గౌడ్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు మరింత విస్తృతంగా సేవలందించాలని కేజీకేఎస్ మండల కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేజీకేఎస్ మండల అధ్యక్షులు బబ్బూరి ఉప్పలయ్య, మండల కార్యదర్శి మోడెం వెంకటేశ్వర్లు, కేజీకేఎస్ సొసైటీ అధ్యక్షులు మేడి ఉపేందర్, ఇనుగుర్తి సొసైటీ అధ్యక్షులు మల్లయ్య, దానసరి సొసైటీ అధ్యక్షులు చింతనూరి వెంకన్న, ఉప్పరపల్లి సొసైటీ అధ్యక్షులు శంకరయ్య, కాట్రపల్లి సొసైటీ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, అప్పనపల్లి సొసైటీ అధ్యక్షులు జర్నలిస్టు యాకన్న, వెంకటగిరి సొసైటీ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, రంగాపురం సొసైటీ అధ్యక్షులు వీరభద్ర గౌడ్, ఉప్పరపల్లి సొసైటీ సెకండ్ అధ్యక్షులు తాండ వెంకన్న, జోగు రాములు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం..!

## సమర్థవంతమైన పోలీసింగ్‌కు ఎస్పీ డా. శబరీష్ ఆదేశం




**చిన్నగూడూరు, ఆగస్టు 14 (జనం వాయిస్) :** మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామీణ ప్రాంతాల్లో నేరాలకు అడ్డుకట్ట వేయాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. చిన్నగూడూరు పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా పరిశీలించిన ఎస్పీ.. పెండింగ్ కేసులు, పిటిషన్లు, రికార్డుల నిర్వహణపై సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. కేసుల దర్యాప్తును వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. గంజాయి సాగు, అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్పీ స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, ప్రాంతాలపై సమాచారం సేకరించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.



యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో గుడుంబా తయారీ, విక్రయాలను అరికట్టేందుకు నిరంతర దాడులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. అక్రమ మద్యం తయారీ కేంద్రాలపై నిఘా పెంచడంతో పాటు, బాధితులకు కౌన్సెలింగ్, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. రౌడీషీటర్లు, అనుమానితులు, నార్కోటిక్స్ నేరస్థుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రామాల్లో నేరాలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్స్ ద్వారా గ్రామాల్లో నేర సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించాలని, బ్లూ కోల్ట్స్ సిబ్బంది అత్యవసర సమయంలో వేగంగా స్పందించేలా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. నైట్ పెట్రోలింగ్, బీట్ విధులు, గ్రామ సందర్శనలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. తనిఖీ అనంతరం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎస్పీ డా. శబరీష్ మొక్కను నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మరిన్ని మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సిబ్బందికి సూచించారు.

డైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక
RNI NO: TGTEL/26/A0383
DYNAMIC JANAMVOICE WWW.JANAMVOICE.COM



# బేతమళ్ళ చంద్రయ్యకు మాజీ ఎంపీ కవిత పరామర్శ



**మహబూబాబాద్, ఆగస్టు 14 (జనం వాయిస్) :** మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బేతమల్ల చంద్రయ్య ఇటీవల గుండెకు చికిత్స చేయించుకుని ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవిత ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న కవిత, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనలో మనోధైర్యాన్ని నింపుతూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మాజీ ఎంపీ కవిత వెంట పీఏసీఎస్ చైర్మన్ దికొండ వెంకన్న, తెలంగాణ రాష్ట్ర మాల జర్నలిస్ట్ ల జిల్లా ప్రధాన కార్యదర్శి దార్ల భాస్కర్, మాజీ సర్పంచ్ దార్ల రామూర్తి, నాగారం ఉపసర్పంచ్ బాలాజీ నాయక్, గండు నాగన్న, పప్పుల వెంకన్న (108), వేముల శ్రీను, ఉమాగానీ మల్లయ్య, రహీం పాషా, గడ్డం శ్రీకాంత్, బేతమల్ల మనోజ్, పెండ్లి మహేందర్, మధు, అశోక్, క్రాంతి, సందీప్ తదితరులు ఉన్నారు.

# ఇనుగుర్తిలో ఎస్ఐలకు ఘన సన్మానం

### బదిలీపై వెళ్తున్న కరుణాకర్‌కు వీడ్కోలు

### నూతన ఎస్ఐ నరేష్‌కు స్వాగతం



**మహబూబాబాద్, ఆగస్టు 14 (జనం వాయిస్) :** ఇనుగుర్తి మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పోలీసు అధికారులకు ఘన సన్మానం నిర్వహించారు. ఇనుగుర్తి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించి నెల్లికుదురు మండలానికి బదిలీపై వెళ్తున్న సబ్‌ఇన్‌స్పెక్టర్ గంగరాపు కరుణాకర్‌కు వీడ్కోలు పలికారు. అదే సమయంలో ఇనుగుర్తికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సబ్‌ఇన్‌స్పెక్టర్ నరేష్‌కు సంఘం నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేసిన కరుణాకర్ సేవలను అభినందించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ నరేష్ కూడా ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, చట్టపరంగా సమర్థవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు గోపదాస్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి బేతమల్ల మనోజ్, కోశాధికారి పింగిలి శ్రీనివాస్, దిశ కమిటీ సభ్యుడు బాబురావు, పీఏసీఎస్ డైరెక్టర్ కొండ వెంకన్న, స్థానిక సర్పంచ్ తమ్మడపల్లి కుమార్, ఉపసర్పంచ్ సత్తూరి యాదగిరి, చిన్యాతండా సర్పంచ్ హరిచందు, తాజా మాజీ సర్పంచ్ దార్ల రామ్మూర్తి, సంఘం సీనియర్ నాయకులు కామ సంజీవరావు, పప్పుల వెంకన్న (108), గండు నాగన్న, మోటమారి యాకసాయిలు, చిన్నాల కట్టయ్య, ఎండీ రహీమ్, ప్రశాంత్, సలీమ్, నర్సయ్య, క్రాంతి, శ్రీకాంత్, మహేందర్, మురళి, జంపయ్య, విజయ్, సురేష్, అశోక్, మధు తదితర సంఘం నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# సిరోలులో ఉచిత వైద్య శిబిరం

### 100 మందికి పైగా వైద్య సేవలు



**కురవి, ఆగస్టు 14 (జనం వాయిస్) :** సిరోలు మండలంలో సెల్యులైటిస్ వ్యాధి అధికంగా ఉన్నట్లు గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, సిరోలు మండల అభివృద్ధి ప్రదాత, ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు, స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ఎమ్మెల్సీ వేదవెల్లి వెంకటరెడ్డి తనయులు వేదవెల్లి హర్షవర్ధన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే స్పందించి ప్రజల సమస్యను మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఆరోగ్య సమస్యను గుర్తించి, వెంటనే స్పందించిన డిఎంహెచ్ఓ ఆధ్వర్యంలో శుక్రవారం సిరోలు గ్రామంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి సిరోలు మండల కేంద్రానికి చెందిన 100 మందికి పైగా ప్రజలు హాజరై వైద్య పరీక్షలు చేయించుకుని, అవసరమైన చికిత్స పొందారు. శిబిరంలో డా. విరాజిత, డా. మౌనిక, డా. షఫీ, డా. నరేష్ వైద్య సేవలు అందించారు. సూపర్వైజర్‌గా రాజకుమారి, హెల్త్ అసిస్టెంట్‌గా శ్రీధర్, ఎఎన్ఎం సునీత, ఆశా కార్యకర్తలు పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. ప్రజల సమస్యను హర్షవర్ధన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన మహబూబాబాద్ వైద్య అధికారితో పాటు వైద్య సిబ్బందికి సిరోలు మండల ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

హర్షవర్ధన్ రెడ్డికి అభినందనలు తెలిపిన ప్రజలు..,

సిరోలు గ్రామంలో నెలకొన్న ఆరోగ్య సమస్యను గుర్తించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వైద్య శిబిరం ఏర్పాటు చేయించడంపై హర్షవర్ధన్ రెడ్డి చొరవను గ్రామ ప్రజలు అభినందించారు. ప్రజల ఆరోగ్యం పట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు ఇదే విధంగా తక్షణ స్పందన చూపాలని వారు కోరారు.

# ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా

### నెలకు రూ.14,500 నుంచి రూ.18,000 వరకు స్టైపెండ్

### ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ బి. ఓంకార్



**మహబూబాబాద్, ఆగస్టు 14 (జనం వాయిస్) :** మహబూబాబాద్‌లోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 17న ఉదయం 11 గంటలకు ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ బి. ఓంకార్ తెలిపారు. ఈ మేళాలో ఆస్ట్రా మైక్రోవేవ్, ష్నైడర్ ఎలక్ట్రిక్, ఫెనెస్టా, పిట్టి క్లయింట్ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ మేళాకు హాజరుకావచ్చని తెలిపారు. అర్హత సాధించిన అభ్యర్థులకు నెలకు రూ.14,500 నుంచి రూ.18,000 వరకు స్టైపెండ్‌తో పాటు ఉచిత భోజనం, రవాణా సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా www. apprenticeshipindia.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, ఫొటోలతో మేళాకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

# పీఆర్సీ, డీఏ బకాయిలు విడుదల చేయాలి...

### సెప్టెంబరు 1 మహాధర్నా విజయవంతం చేయాలి..

### పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు

### శశిధర్ శర్మ పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి




**జనం వాయిస్అక్కన్నపేట ఆగస్టు 14:** ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్ శర్మ డిమాండ్ చేశారు. 2026 సంవత్సరానికి సంబంధించిన పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అక్కన్నపేట మండలం కేశవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సభ్యత్వం నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా శశిధర్ శర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం తక్షణమే దృష్టిసారించాలన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులకు సంబంధించిన పీఆర్సీ బకాయిలు, డీఏ పెండింగ్‌లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం పీఆర్టీయూటీఎస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను కాలయాపన చేయకుండా వెంటనే పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఐక్యతను చాటాలని కోరారు. ఈ సందర్భంగా కేశవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పీఆర్టీయూటీఎస్ చేపట్టిన కార్యక్రమాలకు, సెప్టెంబరు 1న నిర్వహించే మహాధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా సీనియర్ నాయకులు సంపత్‌రావు, సర్దార్, కిషన్ నాయక్, బాల్‌రెడ్డి, మల్లేశం, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛమైన భారత్ ఆరోగ్యకరమైన భారత్ కోసం విద్యార్థులకు పిలుపునిచ్చిన

## వలస సుభాష్ వ్యవస్థాపక అధ్యక్షులు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ




**జనం వాయిస్.అక్కన్న పేట ఆగస్టు 14:** గౌరవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మేరా యువభారత్ (మైభారత్ ) మరియు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్షవాడ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు ఒకటో తారీకు నుండి 15 వరకు సిద్దిపేట జిల్లా స్థాయి స్వచ్ఛత పక్షవాడ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది ఈ సందర్భంగా సంకల్ప స్వచ్ఛందంగా సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వలస సుభాష్ విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడుతూ మహాత్మా గాంధీ జి స్వచ్ఛ తో పాటు పరిశుభ్రమైన అభివృద్ధి చెందిన భారతదేశాన్ని కలగన్నారు భరతమాతను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దేశానికి సేవ చేయడం మనందరి బాధ్యత అని విద్యార్థులతో అన్నారు నేను పరిశుభ్రత పట్ల ఎల్లప్పుడు నిబద్ధతతో ఉంటాన నేను పరిశుభ్రతతో కోసం నా సమయాన్ని కేటాయిస్తానని ప్రతిజ్ఞ చేసినట్టు ఆయన విద్యార్థులతో తెలిపారు స్వచ్ఛమైన పరిసరాలు ఆరోగ్యానికి మన సమాజానికి మన దేశ అభివృద్ధికి ఎంతో ముఖ్యమని విద్యార్థులతో అన్నారు గ్రామాలు పట్టణాలు మరియు నగరాలు స్వచ్ఛ భారత్ మిషన్ సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన విద్యార్థితో అన్నారు ప్రతి విద్యార్థి పరిశుభ్రత కోసం నేను సైతం అంటూ ముందడుగు వేస్తూ భారతదేశాన్ని మరింత పరిశుభ్రమైన దేశంలో మార్చేందుకు విద్యార్థులు కృషి చేయాలని వారితో అన్నారు స్వచ్ఛత కార్యక్రమములో యువజన సంఘాలు మహిళా సంఘాలు యువత విద్యార్థులు స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ శాఖలు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలని ఆయన వేడుకున్నారు తదనంతరం గౌరవెల్లి పాఠశాలలో జిల్లాస్థాయిలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ ప్రధాన చార్యులు ఏ జ్యోతి గారిని శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఏ జ్యోతి ఫిజికల్ డైరెక్టర్ జంగాపల్లి వెంకట నరస య్య రామన్ బాబు శ్రీనివాస్ శ్రీనివాస్ కృష్ణకుమారి నాశ్రీన్ రమాదేవి విద్యార్థులు పాల్గొన్నారు.




# జోగంపల్లి చలివాగు వద్ద ఫొటోలేనా?

### రైతుల పొలాలకు నీళ్ల సంగతేంటి? ... నరహరిశెట్టి రామకృష్ణ..



**జనం వాయిస్, శాయంపేట, ఆగస్టు 14:** శాయంపేట మండలం జోగంపల్లి చలివాగు ప్రాజెక్టు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు ఫొటోషూట్ వేదికగా మారిందని బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రాజెక్టు వద్ద ఫొటోలు దిగడం, పరస్పరం ఆరోపణలు చేసుకోవడం కాకుండా రైతుల పొలాలకు నీరందించేందుకు ఏం చేశారో రెండు పార్టీల నేతలు చెప్పాలని ప్రశ్నించారు. చలివాగు కింద ఆయకట్టు రైతులకు ముందుగా సాగునీరు అందించాలని, ప్రాజెక్టులో నీటి నిల్వలు, నీటి విడుదలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు సైతం చలివాగు నీటి విషయంలో తమ హయాంలో తీసుకున్న నిర్ణయాలపై ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. మీరు చేస్తున్న పనులన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తప్పకుండా తగిన బుద్ధి చెబుతారని రామకృష్ణ హెచ్చరించారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# మన దేశం... మన జెండా

వేకువ జామున వీచే
చల్లగాలులు చేసే సవ్వడి
మన భారతం ఘన భారతం
నవభారతం యువభారతం
ఉదయభానుడి ఉషాకిరణాలలో
మెరిసే అద్భుత దృశ్యం
మదిలో భరతమాత ప్రత్యక్షం
అరుణ వర్ణ కొండల్లో...
శ్వేత వర్ణ సెలయేళ్లలో...
హరిత వర్ణ ప్రకృతిలో...
గోచరించింది త్రివర్ణ పతాకం
లిపక్షుల కిలకిలరావంలో
కోకిల మధుర గానంలో
వినిపించిన నాదం
భారత జాతీయ గీతం
లివందేమాతరమంటూ...
నవ జవానులై కవాతు చేసిన
విద్యార్థుల నోట
ధ్వనించిన నాదం
సమస్త భారతీయుల నినాదం
లిఈ స్వాతంత్ర దినోత్సవ వేళ
భారతావనిలో ఆనంద హేళ
వినీల ఆకాశం నిండా
ఎగిరింది జాతీయ జెండా
దేశభక్తి నిండింది
అందరి గుండెలనిండా
విశ్వవిఖ్యాత
మన తిరంగా జెండా



' సిహెచ్. శ్రీనివాస్
ఉపాధ్యాయుడు
ZPHS కనుకుల
స్వగ్రామం: ఎలిగేడు
(ప్రతి ఒక్కరికి స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు.

# ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావన నిండాలి

## నక్కా శ్రీనివాస్ రెడ్డి



**జనం వాయిస్.కోహెడ ఆగస్టు 14:** దేశవ్యాప్తంగా సాగుతున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా నాచీ ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ అడ్వకేట్, బీజేపీ నాయకులు నక్కా శ్రీనివాస్ రెడ్డి తమ నివాసంపై జాతీయ త్రివర్ణ పతాకాన్ని అత్యంత ఉత్సాహంగా, గౌరవప్రదంగా ఎగురవేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ప్రతి భారతీయుడిలో దేశభక్తిని నింపుతోందని అన్నారు. మన దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా, ప్రతి ఒక్కరిలోనూ జాతీయ భావం, దేశభక్తి నిరంతరం ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. మన జాతీయ జెండా ఐక్యతకు, సమగ్రతకు, దేశ గౌరవానికి ప్రతీక అని పేర్కొంటూ, ప్రతి పౌరుడు దేశాభివృద్ధిలో భాగస్వామి కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, నాయకులు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మరిపెడలో సర్వ సభ్య సమావేశం

## -ప్రజా సమస్యలపై సమగ్ర సమీక్ష





**డోర్నకల్/మరిపెడ,ఆగస్టు 14(జనం వాయిస్):** మరిపెడ మండల కేంద్రంలో గురువారం సర్వ సభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ప్రభుత్వ విప్,డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమావేశంలో మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు,సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం,విద్యుత్,ఇతర మౌలిక వసతుల కల్పనపై ప్రజా ప్రతినిధులతో క్షుణ్ణంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ,మండల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు,ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి.ప్రజల నుంచి వచ్చే సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు.సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలి అని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.అనంతరం మండలంలోని పలు అభివృద్ధి పనుల పురోగతి,ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలపై అధికారులతో చర్చించి,పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. మరిపెడ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సమష్టిగా కృషి చేయాలి అని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్,సర్పంచులు,ప్రజా ప్రతినిధులు,అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

### డాక్టర్ గుగులోత్ రవి.

### బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం.




**మరిపెడ,ఆగస్టు 14(జనం వాయిస్):** ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని వైద్యాధికారి డాక్టర్ గుగులోత్ రవి సూచించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామంలో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డాక్టర్ గుగులోత్ రవి,సర్పంచ్ బోడ సోమన్న,ఉప సర్పంచ్ షరీఫ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ గుగులోత్ రవి మాట్లాడుతూ పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక రకాల వ్యాధులను నివారించవచ్చని తెలిపారు.ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు.వైద్య శిబిరంలో గ్రామస్తులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి,అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు: హెల్త్ సూపర్‌వైజర్ ఆచార్యులు,సంస్థ సెంటర్ మేనేజర్ గంధసిరి ఉపేంద్ర,కోఆర్డినేటర్లు జజ్జూరి ఉపేంద్ర,గుగులోత్ కవిత,ఏఎన్ఎంలు అనిత,స్వప్న,గ్రామ పెద్దలు రాయల రవి,ఉషా,యాదగిరి,గ్రామ లీడర్లు సమ్మక్క,ఆశా వర్కర్లు మాధవి,జ్యోతి మరియు గ్రామస్తులు పాల్గొన్నారు...

# వావిలాకు కషాయంతో పురుగుల నివారణ..



**జనం వాయిస్, శాయంపేట, ఆగస్టు 14:** శాయంపేట మండలం ప్రగతిసింగారం గ్రామంలో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రతినిధి షేక్ గౌస్ ఆధ్వర్యంలో శుక్రవారం బీసీఐ రైతులకు వావిలాకు కషాయం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 100 లీటర్ల కషాయాన్ని రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారి మార్క ప్రియదర్శిని మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రసంపీల్చే పురుగుల బెడద పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులు రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించి వావిలాకు కషాయం, వేప కషాయం, వర్మీకంపోస్ట్ వంటి ప్రకృతి ఆధారిత పద్ధతులను వినియోగించాలని సూచించారు. వీటితో సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచి మాదారపు సరోజన, ఉపసర్పంచి దాసరి లక్ష్మారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి సానియా, నవయుగ సొసైటీ డైరెక్టర్ కర్రు ఆదిరెడ్డి, రైతులు, ప్రజ్వల్ క్షేత్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక
RNI NO: TGTEL/26/A0383
DYNAMIC JANAMVOICE WWW.JANAMVOICE.COM



# ఆర్‌బిఎస్‌కే లక్ష్యాలు సాధించాలి

నిర్లక్ష్యంపై చర్యలు తప్పవు : డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రవి రాథోడ్



**మహబూబాబాద్, ఆగస్టు 14 (జనం వాయిస్) :** జిల్లాలో రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంను సమర్థవంతంగా అమలు చేసి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ సూచించారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాల మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆర్బీఎస్కె కార్యక్రమం ప్రగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్బీఎస్కె బృందాల వైద్యులు, ఫార్మసిస్టులు, ఎఎన్‌ఎం లతో కార్యక్రమం అమలు తీరుపై సమీక్షించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించాలని సూచించారు. కేటాయించిన లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో హెచ్చరించారు. వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఆర్బీఎస్కె అమలులో మహబూబాబాద్ జిల్లాను రాష్ట్రంలోనే ముందువరుసలో నిలపాలని ఆయన అన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆర్బీఎస్కె మెడికల్ ఆఫీసర్లు, ఫార్మసిస్టులు, ఎఎన్‌ఎం లు తదితరులు పాల్గొన్నారు.

## శతాధిక వృద్ధురాలి కుటుంబానికి మాలోత్ కవిత పరామర్శ




**మహబూబాబాద్, ఆగస్టు 14 (జనం వాయిస్) :** మహబూబాబాద్ మున్సిపాలిటీ 6వ వార్డు బేతోలు గ్రామానికి చెందిన ప్రముఖ భవన నిర్మాణ మేస్త్రి షేక్ యూసుఫ్ తల్లి, శతాధిక వృద్ధురాలు షేక్ సైదాబీ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. 102 ఏళ్ల సుదీర్ఘ జీవితాన్ని పూర్తి చేసుకున్న షేక్ సైదాబీ ఎలాంటి తీవ్రమైన అనారోగ్య సమస్యలు లేకుండా వృద్ధాప్యం వరకు ఆరోగ్యంగా జీవించడం విశేషమని మాలోత్ కవిత అన్నారు. వృద్ధాప్యంలో సహజ మరణం పొందడం అరుదైన విషయమని పేర్కొన్నారు. అనంతరం సైదాబీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ధార యాదగిరిరావు, రాంజీ, ఖాదర్ బాబా, పెద్దపాటి సంపత్, సంతోష్, ఎల్లయ్య, శ్రీధర్, రవీందర్, జానీ, మహిమూద్ హుస్సేన్, ప్రతాప్, జావిద్, షేక్ గౌస్, సీతారాం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ నేత్ర కంటి హాస్పిటల్ ఘనంగా ప్రారంభోత్సవం...

- దృష్టి లోపాలను నివారించుకోవాలి.

నిపుణులైన డాక్టర్లతో పరీక్షలు.

ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్



**మరిపెడ,ఆగస్టు 14(జనం వాయిస్):** కళ్ళను జాగ్రత్తగా చూసుకుంటేనే ప్రపంచాన్ని చూడగలమని ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్ అన్నారు.మహబూబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని కార్గిల్



సెంటర్ లో శ్రీ నేత్ర కంటి ఆసుపత్రి మరియు ఆప్టికల్స్ ను ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్ ప్రారంభించారు.వైద్యవృత్తి ఎంతో గొప్పదని,ప్రజలకు నమ్మకం కలిగే విధంగా వైద్యం చేసి మంచి పేరును సంపాదించు కోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గుగులోతు రవి నాయక్,చైర్ పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి,వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి,టౌన్ అధ్యక్షులు రాంలాల్,కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు గంధసిరి బిక్షపతి,బాలాజీ,లింగయ్య, సత్యం ఇంకా తదితరులు పాల్గొన్నారు...

## స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విస్తృత తనిఖీలు

ఫ్యూచర్ సిటీ కమిషనర్ ఆదేశాలతో.. ఇబ్రహీంపట్నంలో పోలీసుల అప్రమత్తత

కొత్త బస్టాండ్‌లో డాగ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు



**ఇబ్రహీంపట్నం, ఆగస్ట్ 14,(జనం వాయిస్ ):** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఫ్యూచర్ సిటీ కమిషనర్, ఇబ్రహీంపట్నం ఏసీపీ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు అప్రమత్త మయ్యారు. ఇబ్రహీంపట్నం ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఇబ్రహీంపట్నం కొత్త బస్టాండ్‌ను పోలీసులు ప్రత్యేకంగా పరిశీలించారు. ప్రయాణికుల రద్దీ, బస్టాండ్ పరిసర ప్రాంతాలు, అనుమానాస్పద వస్తువులు, వాహనాలపై నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో డాగ్ స్క్వాడ్‌ను కూడా రంగంలోకి దించి బస్టాండ్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దృష్టిలో పెట్టుకుని బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు, వాహనాల కదలికలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రయాణికులకు సూచించారు.ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపడుతోందన్నారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు. బస్టాండ్‌లు, రద్దీ ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని చెప్పారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతోందని ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఏస్ఐ రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రీసర్వేతో ప్రభుత్వ భూములకు రక్షణ.. భూ సమస్యలకు పరిష్కారం!

రైతులు, ప్రజల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

ప్రభుత్వ, ఆబాది, పట్టాదార్ భూములపై క్షేత్రస్థాయి పరిశీలన

రీసర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్



**మహబూబాబాద్, ఆగస్టు 14 (జనం వాయిస్) :** మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా రీసర్వేలో భాగంగా ప్రభుత్వ, ఆబాది , పట్టాదార్ భూముల సర్వే ప్రక్రియ వేగవంతంగా సాగుతోందని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని దంతాలపల్లి మండలం, కాల్వపల్లి గ్రామాల్లో జరుగుతున్న క్షేత్రస్థాయి సర్వే పనులను స్వయంగా మండల సర్వేయర్ శ్రీ నిత్య, తో కలిసి బైక్ పై వెళ్లి తనిఖీ చేసి, పాలు,సూచనలు జారీ చేశారు. జిల్లాలో 77 గ్రామాల సర్వేకు గెజిట్ ప్రతిపాదన వచ్చిందని, అందులో భాగంగా దశలవారీగా సర్వే కొనసాగుతుందని, మొదటి దశలో 11 గ్రామాలలో సర్వే ప్రారంభమైందని, ఆబాది, ప్రభుత్వ భూముల, పట్టేదారు భూములను ముందస్తు సమాచారంతో పారదర్శకతకు ప్రాధాన్యం: సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో పనులు పూర్తి చేయాలని రెవెన్యూ, సర్వే అధికారులను ఆదేశించారు. రైతుల భాగస్వామ్యం: సరిహద్దు వివాదాలు తలెత్తకుండా సర్వే నిర్వహించే సమయంలో సంబంధిత భూయజమానులు (పట్టాదార్లు) మరియు పొరుగు భూముల యజమానుల సమక్షంలోనే కొలతలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆబాది స్థలాలు, ప్రభుత్వ భూములను ఖచ్చితమైన కొలతలతో రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. సర్వే పనులను వేగవంతం చేసేందుకు మరియు ఖచ్చితమైన సరిహద్దులను గుర్తించేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. "భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే ఈ రీసర్వే యొక్క ముఖ్య ఉద్దేశం. ప్రజలు, రైతులు సర్వే బృందాలకు సహకరించి తమ భూములకు సంబంధించిన సరైన వివరాలను అందించాలి" అని కోరారు. అనంతరం మరిపెడ మండలంలోని దంతాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో(ఎంక్వస్ )నేషనల్ క్వాలిటీ అసెస్మెంట్ ఎన్ హెచ్ ఎం సెంట్రల్ టీం వర్చువల్ అసెస్మెంట్లో భాగంగా పెద్ద ముప్పారం ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ ను తనిఖీ నిర్వహించినారు. వ్యాధిగ్రస్తుల ఆరోగ్య సేవలు రికార్డులను పరిశీలించి, ఆరోగ్య సేవలు మెరుగుపరచడానికి రక్త నమోనా సేకరణ పరీక్షలను, బయో మెడికల్ వేస్టేజ్ అనగా వ్యాధి గ్రస్తులు వాడిన సూదులు, చీము తో కూడిన దూది, బ్యాండేజ్ లు మరియు టీకాలు వేసిన ఇంజక్షన్లను వ్యర్థాలను సేకరించడంను, వ్యాధిగ్రస్తులకు సరియైన రీతిలో ఆరోగ్య సేవలు (మందులు, చికిత్స) అందుతున్నాయా అని, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిశుభ్రత లను ఎన్ హెచ్ ఎం సెంట్రల్ టీం వర్చువల్ గా పరిశీలించినారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, డాక్టర్ కవిత, ఎన్ హెచ్ ఎం డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ నీలోహన, క్వాలిటీ మేనేజర్ సురేష్, ల్యాండ్ సర్వేయర్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, ఆర్డీవో గణేష్, తాహసిల్దార్ సునీల్ రెడ్డి, ఎంపీడీవో సక్రియ, తదితరులు పాల్గొన్నారు.


# రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు

-- మైనర్, ట్రిపుల్ రైడింగ్‌లపై ప్రత్యేక దృష్టి

... జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



**మహబూబాబాద్, ఆగస్టు 14 (జనం వాయిస్) :** ఇటీవలి కాలంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి, ప్రజల ప్రాణాలను కాపాడటానికి ట్రాఫిక్ రవాణా శాఖలు సంయుక్తంగా కఠిన చర్యలు చేపడుతున్నాయని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అన్ని విభాగాల సంబంధిత అధికారులతో కలిసి రోడ్ సేఫ్టీ పై సమీక్ష సమావేశం నిర్వహించారు, రహదారి భద్రత అనేది కేవలం చట్టాల అమలుతోనే కాకుండా, ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతతోనే సాధ్యమవుతుంది. ముఖ్యంగా చిన్న వయస్సు గల పిల్లలు వాహనాలు నడపడం (మైనర్ డ్రైవింగ్), ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించడం (ట్రిపుల్ రైడింగ్) వల్ల అనేక దారుణ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వీటిని అరికట్టేందుకు విస్తృత తనిఖీలతో పాటు కఠిన శిక్షలు అమలు చేస్తున్నాం.మైనర్ డ్రైవింగ్ -- తల్లిదండ్రులదే ప్రాథమిక బాధ్యత తల్లిదండ్రులపై కేసులు: 18 సంవత్సరాల నిండని మైనర్లకు వాహనాలు ఇస్తే, సదరు వాహన యజమాని లేదా తల్లిదండ్రులపై చట్టపరమైన కేసులు (ఎఫ్ఐఆర్) నమోదు చేయబడతాయి. మోటారు వాహనాల సవరణ చట్టం ప్రకారం రూ.25,000 జరిమానాతో పాటు తల్లిదండ్రులకు లేదా వాహన యజమానికి మూడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ప్రమాదానికి గురైన లేదా మైనర్లు నడిపిన వాహనం యొక్క రిజిస్ట్రేషన్‌ను ఏడాది పాటు రద్దు చేయడం జరుగుతుంది. మైనర్లు 25 సంవత్సరాల వయస్సు వచ్చేవరకు డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి అనర్హులుగా ప్రకటించబడతారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరికి మించి ప్రయాణించడం చట్టరీత్యా నేరం. ట్రిపుల్ రైడింగ్ వల్ల వాహనంపై నియంత్రణ కోల్పోయి తీవ్ర ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రిపుల్ రైడింగ్‌కు పాల్పడే వారికి కఠిన జరిమానాతో పాటు వారి డ్రైవింగ్ లైసెన్స్‌ను 3 నెలల పాటు సస్పెండ్ చేయడం జరుగుతుంది. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే తక్షణమే ఈ-చలాన్ మరియు వాహనం స్వాధీనం చేసుకునే అవకాశాలు ఉన్నాయి. వాహనదారులు (పిలియన్ రైడర్‌తో సహా) నాణ్యమైన ఐఎస్ఐ మార్క్ హెల్మెట్ ధరించాలి. కార్లలో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలి. తాగి వాహనం నడిపితే వాహనం జప్తు చేయడంతో పాటు కోర్టుకు పంపడం జరుగుతుందన్నారు, వాహనం నడుపుతున్నప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడటం, సిగ్నల్ దాటడం లాంటివి అత్యంత ప్రమాదకరం. లైన్ డ్రైవింగ్ ప్రయాణాల్లో క్రమశిక్షణ పాటించాలి, అకస్మాత్తుగా లేన్ మార్చడం వల్ల వెనుక వచ్చే వాహనాల ప్రమాదాల్లో ఎంతో మంది తమ విలువైన ప్రాణాలను కోల్పోయి కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు. విద్యార్థులు, యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. రండి, అందరం కలిసి సురక్షితమైన ప్రయాణ సమాజాన్ని నిర్మిద్దాంఅన్నారు. రహదారి భద్రతను పెంపొందించడం , ప్రమాదాల బారిన పడిన వ్యక్తుల ప్రాణాలను కాపాడేందుకు రవాణా మరియు పోలీసు శాఖ సంయుక్తంగా ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రతి ఏటా జరుగుతున్న రహదారి ప్రమాదాలలో సమయానికి వైద్య సహాయం అందక అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు. దీనిని నివారించడానికి పౌరుల భాగస్వామ్యం అత్యంత కీలకమని భావిస్తూ ప్రభుత్వం ఈ క్రింది నిర్ణయాలు, మార్గదర్శకాలను విడుదల చేసింది. ప్రమాదం జరిగిన మొదటి 60 నిమిషాల వ్యవధిని 'గోల్డెన్ అవర్' అని అంటారు. ఈ సమయంలో క్షతగాత్రులకు సరైన వైద్య సహాయం అందిస్తే వారి ప్రాణాలను కాపాడే అవకాశం 80% వరకు పెరుగుతుంది. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి, గోల్డెన్ అవర్‌లో ప్రాణాలు కాపాడే 'ఉత్తమ సమారిటన్' (గుడ్ సమారిటన్/ రక్షకుడు) లకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ నగదు బహుమతి 25 వేలు, అభినందన పత్రం అందజేస్తుంది. చట్టపరమైన మినహాయింపులు: క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకొచ్చే వ్యక్తులను పోలీసు విచారణ పేరుతో వేధించడం జరగదు. వారి పేరు, చిరునామా తెలపడం పూర్తిగా వారి ఐచ్ఛికం. ఆసుపత్రుల్లో కూడా వారి నుండి ఎలాంటి డిపాజిట్ రుసుము డిమాండ్ చేయకూడదు. రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా ప్రతి వాహనదారుడు ఈ క్రింది భద్రతా వేగమే ప్రమాదాలకు ప్రధాన కారణం. కాబట్టి నిర్ణీత వేగ పరిమితిలోనే వాహనాలను నడపాలి. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ ధరించాలి. ద్విచక్ర లేదా నలుగు చక్రాల వాహనాలైనా, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం శిక్షార్హమైన నేరం. డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్ వాడకూడదు: వాహనం నడుపుతున్నప్పుడు ఫోన్ మాట్లాడటం లేదా మెసేజ్ చేయడం వల్ల దృష్టి మళ్లి ప్రమాదాలు జరుగుతాయి. రాంగ్ రూట్ డ్రైవింగ్, ఓవర్‌టేకింగ్, రెడ్ లైట్ జంపింగ్ వంటివి చేయకూడదు. ప్రమాదం జరిగినప్పుడు వెంటనే సంప్రదించాల్సిన అత్యవసర నంబర్లు రహదారిపై ప్రమాదాన్ని గమనిస్తే వెంటనే స్పందించి ఈ క్రింది నంబర్లకు సమాచారం అందించండి..అంబులెన్స్ సేవలు: 108, పోలీసు సహాయం: 100 / 112, రహదారి భద్రతా హెల్ప్‌లైన్: 1033 (జాతీయ రహదారుల కోసం) ఇప్పటివరకు జిల్లాలో వివిధ రోడ్డు ప్రమాదాలలో 17 మంది చనిపోయారని, భవిష్యత్తులో ఒక ప్రాణం కూడా పోకుండా ఉండేందుకు జిల్లా సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని తెలిపారు, మైనర్




డ్రైవింగ్లో 5 బండ్లను సీజ్ చేయడం జరిగిందని, ముగ్గురు త్రిబుల్ రైడింగ్ పై ప్రత్యేక చర్యలు నిగా పెట్టడం జరిగిందన్నారు, ప్రధాన జంక్షన్ లలో హైమెస్ లైట్లను, జీబ్రా క్రాసింగ్ లను, స్పీడ్ బ్రేకర్లను, చిన్న చిన్న మరమ్మత్తులను వెంటనే చేయాలని సూచించారు, ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, డిఎస్పి తిరుపతిరావు, ఆర్ అండ్ బి ఈఈ, అన్ని విభాగాల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు మరింత చేరువగా 108, 102, 1962 సేవలు



**యాచారం, ఆగస్టు 14 (జనం వాయిస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న108 అత్యవసర అంబులెన్స్ సేవలు,102 అమ్మఒడి సేవలు, 1962 పశు సంచార వాహన సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా సేవల అధికారి షేక్ జాన్ షాహిద్ తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో 32 అత్యవసర 108 అంబులెన్సులు,10 అమ్మఒడి 102 వాహనాలు, 4 పశు సంచార 1962 వాహనాలు నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్నాయని ఆయన తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు సత్వరమే వైద్య సేవలు అందించడం ఎంతో సంతృప్తినిస్తుందని పేర్కొన్నారు. ప్రజలు 108, 102, 1962 సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఆశా కార్యకర్తలు 102 అమ్మఒడి సేవలను గర్భిణులు, బాలింతలకు చేరువ చేయడంలో కీలక పాత్ర పోషించాలని, తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణతో పాటు మాతాశిశు మరణాలను తగ్గించేందుకు కృషి చేయాలని సూచించారు.గురువారం షేక్ జాన్ షాహిద్‌తో పాటు రాజబాబు, శ్రీహరి, జిల్లా మేనేజర్లు యాచారం సీహెచ్‌సీని సందర్శించి 108, 102, 1962 సేవల పనితీరును పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఎక్కడైనా అత్యవసర పరిస్థితి ఏర్పడిన వెంటనే అప్రమత్తమై,వేగంగా స్పందించాలని సూచించారు.అనంతరం సిబ్బంది పనితీరును అధికారులు అభినందించారు. ప్రజలకు నిరంతరం మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని షేక్ జాన్ షాహిద్ సూచించారు.

## ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద వ్యవసాయ కార్మికులకు ఏటా 12 వేలు ఇవ్వాలి

రేషన్ షాపులో 14 రకాల నిత్యావసర



సరుకులు అందించాలి: బాణాల రాజన్న.

**డోర్నకల్/మరిపెడ,ఆగస్టు 14(జనం వాయిస్):** భూమిలేని వ్యవసాయ కార్మికులందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏటా 12 వేల రూపాయలు అందించాలని,రేషన్ షాపుల్లో 14 రకాల నిత్యావసర సరుకులు పేదలకు అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాణాల రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆగస్టు 14 శుక్రవారం మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామంలో వ్యవసాయ కార్మికుల సమావేశం సంఘం నాయకులు చేనబోయిన వెంకన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాజన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో పాటు పేదలకు 14 రకాల నిత్యావసర సరుకులు కూడా పంపిణీ చేయాలని కోరారు.ప్రస్తుతం రేషన్ కార్డుపై ఒక వ్యక్తికి 6 కిలోల బియ్యం మాత్రమే అందుతున్నాయని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పేద కుటుంబాల ఆదాయాలు పెరగకపోవడంతో వారు పౌష్టికాహారానికి దూరమవుతున్నారని,దీంతో పిల్లల్లో రక్తహీనత,అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.పేదలకు పౌష్టికాహారం అందించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. బియ్యంతో పాటు కందిపప్పు,శనగపప్పు,పెసరపప్పు,మంచి నూనె,గోధుమలు,కోడిగుడ్లు,మిల్లెట్స్,చక్కెర,చింతపండు,పసుపు తదితర 14 రకాల సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

అనంతరం 15 మందితో సంఘం నూతన కమిటీ ఎన్నికైంది.

నూతన కమిటీ సభ్యులు:


గ్రామ గౌరవ అధ్యక్షుడు:చేనబోయిన ఎంకన్న , అధ్యక్షురాలు:బొజ్జ మంగమ్మ , కార్యదర్శి:ఎడ్ల రాములు , ఉపాధ్యక్షురాలు: కేతమ్మ , కోశాధికారి:ఉప్పమ్మ , సభ్యులు:తూము మధు,మాములూరి హుస్సేన్,ఉంద్రాజ్

డైనమిక్ జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM



# సిమెంటు, ఇటుకలు, ఏఐ.. రియల్ ఎస్టేట్ కొత్త ఫార్ములా ఇదే!

## భారత రియల్ ఎస్టేట్ రంగంలో ఏఐ వినియోగం విస్తృతం




భారత రియల్ ఎస్టేట్ రంగం రూపురేఖలు వేగంగా మారుతున్నాయి. సిమెంట్, ఇటుకల వంటి సంప్రదాయ సామగ్రితో పాటు ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత ఈ రంగంలో కీలక శక్తిగా మారుతోంది. గతంలో కేవలం కస్టమర్లను ఆకట్టుకునే వర్చువల్ టూర్లు, చాట్‌బాట్‌లకు పరిమితమైన ఏఐ, ఇప్పుడు నిర్మాణ రంగం మూలాల్లోకి చొచ్చుకెళ్లి ప్రణాళిక, వ్యయ నియంత్రణ, ప్రాజెక్టుల నిర్వహణలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతోంది. ప్రస్తుతం భారతదేశ రియల్ ఎస్టేట్ మార్కెట్ విలువ సుమారు 650 బిలియన్ డాలర్లు కాగా, 2047 నాటికి ఇది 5.8 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఇండియా బ్రాండ్ ఈక్విటీ ఫౌండేషన్ అంచనా వేసింది. ఈ భారీ వృద్ధిని అందుకోవాలంటే నిర్మాణంలో వేగం, సామర్థ్యం పెరగడం తప్పనిసరి. ఇక్కడే ఏఐ డెవలపర్లకు కొత్త మార్గాన్ని చూపిస్తోంది. రాబోయే ఏడేళ్లలో ఒక్క జనరేటివ్ ఏఐ వాడకం వల్ల రియల్ ఎస్టేట్ స్థూల విలువకు (+వాా) సుమారు వి14-17 బిలియన్లు అదనంగా జత అవుతాయని జ్-పార్థినాన్, క్రెడాయ్ సంస్థల సంయుక్త నివేదిక పేర్కొంది. గతంలో ఏఐ అంటే డిజిటల్ మార్కెటింగ్, వ్యక్తిగత సిఫార్సులు మాత్రమే. కానీ ఇప్పుడు “ఏఐ ఏం చేయగలదు?” అనే ప్రశ్న స్థానంలో “మన తదుపరి ప్రాజెక్టులో ఏఐని ఎంత వేగంగా అమలు చేయాలి?” అనే చర్చ మొదలైంది. ఏ ప్రాజెక్టు ఎప్పుడు, ఎక్కడ నిర్మించాలి, ఖర్చు ఎంత అవుతుంది, నిర్మాణంలో ఎదురయ్యే రిస్క్‌లను ముందుగానే ఎలా గుర్తించాలి వంటి కీలక నిర్ణయాల్లో ఏఐ ప్రధాన పాత్ర పోషిస్తోంది.

ఏఐతో కలిగే ప్రయోజనాలు:

ఏఐ వాడకం వల్ల అమ్మకాల వేగం 30-50% పెరగడంతో పాటు, ప్రాజెక్టులను మార్కెట్లోకి విడుదల చేసే ప్రక్రియలో 30% వేగం పుంజుకుంటుందని అంచనా. సిబ్బంది ఉత్పాదకత 20-50% మేర మెరుగుపడుతుంది. భూమి కొనుగోలు ఒప్పందాలు 30-35% వేగంగా పూర్తవుతాయి. మాన్యువల్ రిపోర్టింగ్ శ్రమ 30-40% తగ్గుతుంది. రిస్క్‌లను ముందుగానే పసిగట్టడం ద్వారా ప్రాజెక్టుల పూర్తి సమయం 5-10% మెరుగుపడుతుంది. పవర్‌ప్లే, ఇంకర్స్ టెక్నాలజీస్ వంటి సంస్థలు అభివృద్ధి చేసిన ఏఐ టూల్స్.. ఇంజనీర్లు ఇచ్చే డ్రాయింగ్‌లు, సైట్ ఫోటోలు, వాయిస్ నోట్స్ వంటి అసంపూర్ణ డేటాను సైతం విశ్లేషించి కచ్చితమైన అంచనాలు అందిస్తున్నాయి. గతంలో రోజుల తరబడి పట్టే వ్యయ అంచనా పనులు ఇప్పుడు కొన్ని గంటల్లోనే పూర్తవుతున్నాయి. లగ్జరీ ఇళ్లలో ఏఐ ఆధారిత బయోమెట్రిక్ యాక్సెస్, స్మార్ట్ హోమ్ ఆటోమేషన్, నివాసితులను గుర్తించే లిఫ్టులు వంటివి వస్తున్నాయి. కార్పొరేట్ రియల్ ఎస్టేట్‌లోనూ ఏఐ వినియోగం వేగంగా పెరుగుతోంది. 2023లో 5% కంటే తక్కువగా ఉన్న కంపెనీలు, 2025 నాటికి 91% ఏఐని వాడేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయని జేఎల్ఎల్ డేటా చెబుతోంది. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయనే ఆందోళనలు ఉన్నప్పటికీ, ఇది ప్రధానంగా డాక్యుమెంటేషన్, రిపోర్టింగ్, అంచనాలు వేయడం వంటి పునరావృత పనులను మాత్రమే చేస్తుందని, తద్వారా ఇంజనీర్లు, ఇతర నిపుణులు కీలక నిర్ణయాలపై దృష్టి పెట్టేందుకు సమయం దొరుకుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం దేశంలోని సంఘటిత డెవలపర్లలో 15-20% మంది పూర్తిస్థాయిలో ఏఐని వాడుతుండగా, మరో 30-40% పైలట్ ప్రాజెక్టులు నడుపుతున్నారు. మొత్తంగా, భారత రియల్ ఎస్టేట్ రంగం తన భారీ లక్ష్యాలను చేరుకోవడంలో ఏఐ ఒక మార్కెటింగ్ సాధనంగా కాకుండా, ప్రధాన కార్యాచరణ శక్తిగా మారుతోందనడంలో సందేహం లేదు.

# ఉల్లిపాయ కోస్తే కన్నీళ్లు ఎందుకు వస్తాయి? ఈ 3 చిట్కాలతో ఇక ఆ బాధ ఉండదు!



- ఉల్లిపాయ కోసినప్పుడు విడుదలయ్యే ఘాటు పదార్థంతో కళ్లలో మంట
- ఆ మంటను తగ్గించేందుకు కళ్లు కన్నీళ్లను ఉత్పత్తి చేస్తాయి
- ఉల్లిపాయను అరగంట ఫ్రిజ్‌లో ఉంచితే మంట తగ్గొచ్చు
- పదునైన కత్తితో కోస్తే కన్నీళ్లు తగ్గే అవకాశం
- గాగుల్స్ పెడితే రసాయనాల ఆవిరి కళ్లను చేరదు

ఉల్లిపాయ కోయడం మొదలుపెట్టగానే కళ్లలో నీళ్లు తిరుగుతాయి. ఎంత త్వరగా కోసినా.. అవి మాత్రం ఆగవు. అసలు ఉల్లిపాయకు, మన కన్నీళ్లకు సంబంధమేంటి? దీనంతటికీ ఓ చిన్న కెమిస్ట్రీ కారణం ఉంది. అంతేకాదు.. ఉల్లిపాయ కోసేటప్పుడు కన్నీళ్లు తగ్గించుకునేందుకు మూడు సింపుల్ ట్రిక్స్ కూడా ఉన్నాయి. ఉల్లిపాయను కోసినప్పుడు దాని కణాలు దెబ్బతింటాయి. దీంతో లోపల విడివిడిగా ఉన్న సల్ఫర్ సమ్మేళనాలు, ‘అల్లినేస్’ అనే ఎంజైమ్ ఒకదానితో ఒకటి చర్య జరుపుతాయి. ఫలితంగా ‘ప్రొపానెథియల్-ఎస్-ఆక్సైడ్’ అనే కంటికి మంట కలిగించే పదార్థం తయారవుతుంది. అది గాలిలో కలిసి కళ్లను తాకగానే కన్నీళ్లు వస్తాయి.

ఫ్రిజ్‌లో పెట్టి కోయండి

ఉల్లిపాయ కోయడానికి ముందు దాన్ని సుమారు అరగంట ఫ్రిజ్‌లో పెట్టండి. చల్లగా ఉన్న ఉల్లిపాయలో ఈ రసాయన చర్య కొంత నెమ్మదిగా జరుగుతుంది. దాంతో కళ్లకు చేరే ఘాటు ఆవిరి కూడా కొంత తగ్గుతుంది. ఫ్రిజ్ నుంచి తీసిన వెంటనే కోస్తే మంచి ఫలితం ఉండొచ్చు.

కత్తి పదునుగా ఉండాలి

మొద్దుబారిన కత్తితో ఉల్లిపాయను కోస్తే.. అది సరిగ్గా కోయడం కంటే ఎక్కువగా నలిగిపోతుంది. దాంతో ఉల్లిపాయలోని ఎక్కువ కణాలు దెబ్బతింటాయి. ఫలితంగా కళ్లకు మంట పెట్టే పదార్థం ఎక్కువగా బయటకు వస్తుంది. అందుకే పదునైన కత్తితో ఒక్కో ముక్కను వేగంగా, సాఫీగా కోయడం మంచిది. దీనివల్ల కన్నీళ్లు తగ్గడంతో పాటు కత్తి జారే ప్రమాదం కూడా తగ్గుతుంది.

కళ్లకు గాగుల్స్ పెట్టుకోండి

ఇది కాస్త విచిత్రంగా అనిపించినా.. బాగా పనిచేసే చిట్కా ఇదే. కిచెన్ గాగుల్స్ లేదా స్విమ్మింగ్ గాగుల్స్ పెట్టుకుని ఉల్లిపాయ కోస్తే ఆ ఘాటు ఆవిరి కళ్లను చేరదు. దీంతో కన్నీళ్లు వచ్చే అవకాశం బాగా తగ్గుతుంది. గాగుల్స్ లేకపోతే ఎగ్జాస్ట్ ఫ్యాన్ దగ్గర ఉల్లిపాయ కోయడం లేదా కిటికీ తెరిచి ఉంచడం కూడా ఉపయోగపడుతుంది. అయితే అన్ని ఉల్లిపాయలు ఒకేలా ఉండవు. కొన్ని రకాల ఉల్లిపాయలు ఎక్కువ ఘాటుగా ఉంటాయి. వాటిని కోసినప్పుడు కన్నీళ్లు కూడా ఎక్కువగా వస్తాయి. అంటే.. మీరు ఉల్లిపాయపై కోప్పడాల్సిన అవసరం లేదు. అది తనను తాను కాపాడుకునేందుకు చేసే ఓ చిన్న రసాయన ప్రక్రియే. మన కళ్లు దానికి స్పందించి నీళ్లు కారుస్తాయంతే.

# రోజూ అవే బాయిల్డ్ ఎగ్స్‌తో విసుగొచ్చిందా?.. ఈ సింపుల్ వెరైటీలు ట్రై చేయండి!

- ప్రొటీన్ కోసం తినే ఉడికించిన గుడ్లు బోర్ కొట్టకుండా తినే మార్గాలు
- చాట్ మసాలా, మిరియాల పొడితో రుచికరమైన స్నాక్స్‌గా మార్చుకోవచ్చు
- ఉల్లిపాయ, టమాటాలతో ఎగ్ చాట్ లేదా బ్రెడ్ టోస్ట్‌పై అల్పాహారంగా తీసుకోవచ్చు
- పెరుగు, కూరగాయలతో కలిపి శాండ్‌విచ్‌లు, సలాడ్లు, రోటీ రోల్స్ తయారు చేసుకోవచ్చు
- ఈ పద్ధతులకు అదనపు వంట అవసరం లేకుండానే భోజనంలో వైవిధ్యం తీసుకురావచ్చు



ఆరోగ్యంపై శ్రద్ధ ఉన్నవారు, బరువు తగ్గాలనుకునేవారు ప్రొటీన్ కోసం తరచుగా ఉడికించిన గుడ్లను తమ ఆహారంలో చేర్చుకుంటారు. అయితే, రోజూ ఒకేలా తినడం వల్ల త్వరగా బోర్ కొడుతుంది. కానీ, కొన్ని సింపుల్ చిట్కాలతో అవే బాయిల్డ్ ఎగ్స్‌ను ఎంతో రుచికరమైన స్నాక్స్‌గా, తేలికపాటి భోజనంగా మార్చుకోవచ్చు. దీనికోసం వంటింట్లో ఉండే సాధారణ పదార్థాలే సరిపోతాయి. ఎలాంటి అదనపు వంట అవసరం లేకుండానే వీటిని క్షణాల్లో సిద్ధం చేసుకోవచ్చు.

త్వరిత స్నాక్స్, చాట్‌గా..

ఉడికించిన గుడ్డును రెండు ముక్కలుగా కోసి, దానిపై కొద్దిగా చాట్ మసాలా, మిరియాల పొడి, కారం, నిమ్మరసం చల్లుకుంటే నిమిషాల్లో మసాలా స్నాక్ సిద్ధమవుతుంది. లేదా గుడ్లను చిన్న ముక్కలుగా కట్ చేసి, అందులో సన్నగా తరిగిన ఉల్లిపాయ, టమాటా, కీర దోస, కొత్తిమీర వేసి, నిమ్మరసం, చాట్ మసాలా కలిపితే రుచికరమైన ‘ఎగ్ చాట్’ రెడీ అవుతుంది. ఇది సాయంత్రం వేళల్లో తినడానికి అద్భుతంగా ఉంటుంది.



అల్పాహారంలో కొత్తగా..

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ కోసం, ఉడికించిన గుడ్డును మెత్తగా చేసి, గోధుమ బ్రెడ్ టోస్ట్‌పై స్ప్రెడ్ చేయాలి. దానిపై మిరియాల పొడి, చిల్లీ ఫ్లేక్స్, టమాటా ముక్కలు వేసుకుంటే సరి. మరింత క్రీమీగా కావాలనుకుంటే, గుడ్డుతో పాటు అవకాడోను కలిపి టోస్ట్‌పై పెట్టుకోవచ్చు. ఇది పోషకాలతో కూడిన మంచి అల్పాహారం. అలాగే, నీళ్లు తీసేసిన గట్టి పెరుగులో ఉడికించిన గుడ్లను మెత్తగా చేసి, మిరియాల పొడి, మూలికలు కలిపి శాండ్‌విచ్‌గా కూడా తయారు చేసుకోవచ్చు.

సలాడ్లు, రోల్స్‌గా..

గుడ్లతో స్పైసీ సలాడ్ కూడా చేసుకోవచ్చు. కీర దోస, లెట్యూస్, టమాటా, ఉల్లిపాయ ముక్కలలో ఉడికించిన గుడ్ల ముక్కలు వేసి, నిమ్మరసం, కొత్తిమీర, పుదీనా వంటివి కలిపితే సరి. అదేవిధంగా, ఉడికించిన గుడ్ల ముక్కలను మొలకెత్తిన పెసలు, కీర, టమాటాలతో కలిపి, కొద్దిగా మసాలాలు జోడిస్తే అధిక ప్రోటీన్లు ఉండే బౌల్ సిద్ధమవుతుంది. గుడ్లను ముక్కలుగా కోసి, కూరగాయలు, చట్నీతో కలిపి రోటీ లేదా చపాతీలో రోల్ చేసుకుంటే ‘ఎగ్ రోల్’గా తినొచ్చు. ఈ పద్ధతుల వల్ల గుడ్లలోని పోషక విలువలు ఏమాత్రం తగ్గకుండా, రోజూ తినే భోజనంలో వైవిధ్యం తీసుకురావచ్చు. ఇది రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం అందిస్తుంది.

# పేగుల్లో మంచి బ్యాక్టీరియా కేవలం జీర్ణ వ్యవస్థకే కాదు, వీటికి కూడా అవసరమే..!



ఇప్పటికే చాలా మందికి ప్రోటీన్ తీసుకోవడం, స్ట్రెంగ్త్ ట్రైనింగ్, ఎక్కువ కాలరీలు తీసుకోవడం కండరాల పెరుగుదలకు ముఖ్యమని తెలుసు. అయితే, ఇటీవల జరిగిన ఒక అధ్యయనం కండరాల శక్తి, శారీరక పనితీరును ప్రభావితం చేసే మరో ముఖ్య అంశాన్ని గుర్తించింది. పేగుల్లో ఉండే ఒక ప్రత్యేకమైన మంచి బ్యాక్టీరియా కండరాల బలం పెంచడంలో నేరుగా సహాయపడుతుందని ఈ పరిశోధన వెల్లడించింది. ఇది గట్-మసిల్ యాక్సిస్ అనే కొత్త భావనకు బలమైన ఆధారాలను అందిస్తోంది. అంటే పేగులలోని సూక్ష్మజీవుల వాతావరణం కండరాల పనితీరును ప్రభావితం చేస్తుంది. గట్-మసిల్ యాక్సిస్ అనేది జీర్ణవ్యవస్థ (గాస్ట్రోఇంటెస్టినల్ ట్రాక్ట్), కండరాల మధ్య ఉండే ద్విముఖ సంబంధం. పేగుల ఆరోగ్యం కండరాల పరిమాణం, పనితీరును ప్రభావితం చేస్తుంది. అదే సమయంలో శారీరక వ్యాయామం కూడా పేగులలోని మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందేందుకు దోహదపడుతుంది.

## పెరిగిన కండరాల పనితీరు..

గట్ అనే జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం ప్రకారం రోసిబ్యూరియా ఇనులినివోరాన్స్ (=శీంవఎబతీఖు అఅబశ్రీఅఅఅజశీ-తీఖుఅం) అనే మంచి బ్యాక్టీరియా కండరాల పనితీరుకు సహజ బూస్టర్‌లా పనిచేస్తుందని వెల్లడైంది. ఇది కేవలం ఆహారాన్ని జీర్ణం చేయడమే కాకుండా, కండరాలు నిర్మాణం అయ్యేందుకు, సమర్థవంతంగా పనిచేయడానికి సంకేతాలు పంపుతుంది. ఇక ఈ పరిశోధనల్లో కొన్ని ముఖ్యాంశాలను కూడా పరిశోధకులు గుర్తించారు. వృద్ధుల్లో ఈ బ్యాక్టీరియా ఎక్కువగా ఉన్నవారికి హ్యాండ్‌గ్రిప్ శక్తి దాదాపు 30 శాతం ఎక్కువగా కనిపించిందని గుర్తించారు. యువతలో ఈ బ్యాక్టీరియా శక్తి మాత్రమే కాకుండా స్టామినా పెరుగుదలతో కూడా సంబంధం కలిగి ఉంది. ఎలుకలపై చేసిన పరీక్షల్లో ఈ బ్యాక్టీరియా ఇచ్చిన గ్రూప్‌లో గ్రిప్ శక్తి 30 శాతం పెరిగింది. మనుషుల్లో కూడా ఈ బ్యాక్టీరియా అధికంగా ఉన్నవారికి లెగ్ ప్రెస్, బెంచ్ ప్రెస్ వంటి వ్యాయామాల్లో మెరుగైన ఫలితాలు కనిపించాయి.

## కండరాలకు శక్తిని ఇస్తుంది..

ఇక ఈ బ్యాక్టీరియా శరీరంలో అమినో ఆమ్లాల వినియోగాన్ని మార్చుతుంది. ఇది కండరాలకు అవసరమైన శక్తి మార్గాలను యాక్టివేట్ చేసి, కండర కణాలు అధిక శక్తిని ఉత్పత్తి చేసుకునేలా సహాయపడుతుంది. సాదారణంగా చెప్పాలంటే ఇది కండరాలకు ఇంధనం అందించే విధానాన్ని మెరుగుపరుస్తుంది. పేగుల్లో లక్షల కోట్ల సూక్ష్మజీవులు (మైక్రోబయోమ్) ఉంటాయి. వీటిలో రోసిబ్యూరియా వంటి మంచి బ్యాక్టీరియా ఎక్కువగా ఉన్నవారు, వ్యాయామం తక్కువ చేసినా కూడా సహజంగా బలంగా ఉండే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు.

## పేగుల ఆరోగ్యం మెరుగైతే..

పేగుల ఆరోగ్యం మెరుగైతే కండరాల శక్తి కూడా మెరుగవుతుంది. అందుకే కొన్ని అలవాట్లు పాటించడం ద్వారా గట్ మసిల్ యాక్సిస్‌ను మెరుగుపరుచుకోవచ్చు. దీని కోసం ఫైబర్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి. ఇది మంచి బ్యాక్టీరియా పెరుగుదలకు దోహదపడుతుంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఇది మైక్రోబయోమ్ వైవిధ్యాన్ని పెంచుతుంది. ప్రోబయోటిక్స్, ప్రీబయోటిక్స్ ఆహారంలో చేర్చాలి. ఇవి పేగుల సమతుల్యతను మెరుగుపరుస్తాయి. ఈ పరిశోధన ఒక ముఖ్యమైన విషయాన్ని చెబుతోంది. కండరాల పెరుగుదల కేవలం ప్రోటీన్ షేక్స్ లేదా బరువులు ఎత్తడంపైనే ఆధారపడదు. పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ప్రోబయోటిక్స్ కూడా కండరాల బలం పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు తెలియజేస్తున్నారు.

# చికున్‌గున్యా తగ్గినా కీళ్ల నొప్పులు వీడట్లేదా?.. నిపుణులు ఏం చెబుతున్నారు?

- చికున్‌గున్యా తర్వాత వచ్చే కీళ్ల నొప్పులు వ్యాధి తిరగబెట్టడమే కానీ రీఇన్‌ఫెక్షన్ కాదు
- శరీరంలో వైరస్ లేకపోయినా కీళ్లలో దాని అవశేషాలు నొప్పిని ప్రేరేపిస్తాయంటున్న నిపుణులు
- 10-15% మంది రోగులు ఏడాదికి పైగా దీర్ఘకాలిక నొప్పులతో బాధపడుతున్నారని వెల్లడి
- 45 ఏళ్లు పైబడిన వారు, మహిళల్లో ఈ సమస్య తిరగబెట్టే ముప్పు అధికం
- దీర్ఘకాలిక నొప్పులకు వైద్యుల పర్యవేక్షణ, సరైన చికిత్స తప్పనిసరి


చికున్‌గున్యా బారిన పడి కోలుకున్న తర్వాత కూడా నెలలు, ఒక్కోసారి సంవత్సరాల తరబడి కీళ్ల నొప్పులు, వాపులు, కీళ్లు బిగుసుకుపోవడం వంటి సమస్యలు చాలా మందిని వేధిస్తుంటాయి. అయితే, ఇది మళ్లీ చికున్‌గున్యా వైరస్ సోకడం (రీఇన్‌ఫెక్షన్) కాదని, ఇది కేవలం వ్యాధి తిరగబెట్టడం (పోస్ట్-వైరల్ రిలాప్స్) మాత్రమేనని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. చికున్‌గున్యా ఒకసారి వస్తే, శరీరంలో దాన్ని ఎదుర్కొనే యాంటీబాడీలు దీర్ఘకాలం, కొన్నిసార్లు జీవితాంతం రక్షణ కల్పిస్తాయి. అందుకే.. మళ్లీ అదే వైరస్ సోకడం అనేది అత్యంత అరుదుగా జరుగుతుందని చెబుతున్నారు.

అసలు ఎందుకు తిరగబెడుతుంది?

చికున్‌గున్యా సోకినప్పుడు వైరస్ రక్తప్రవాహం నుంచి తొలగిపోయినా, దాని జన్యుపదార్థం (వైరల్ ఆర్ఎన్ఏ) లేదా ప్రొటీన్ల అవశేషాలు కీళ్లలోని సైనోవియల్ కణజాలం, మాక్రోఫేజ్‌ల వంటి భాగాల్లో ఉండిపోతాయి. ఈ అవశేషాలు స్థానికంగా రోగనిరోధక వ్యవస్థను ప్రేరేపించి, వాపు, నొప్పికి కారణమవుతాయి. దీన్నే “పోస్ట్-చికున్‌గున్యా క్రానిక్ ఇన్‌ఫ్లమేటరీ ఆర్థరైటిస్” అని పిలుస్తారు. కొన్ని సందర్భాల్లో రోగనిరోధక వ్యవస్థ పొరబడి శరీరంలోని కీళ్ల కణజాలంపైనే దాడి చేస్తుంది. ఇది ఆటో ఇమ్యూన్ సమస్య తరహాలో ఉండి, నొప్పులను మరింత తీవ్రతరం చేస్తుంది. చాలా మంది రోగులు తమకు మళ్లీ వైరస్ సోకిందని ఆందోళన చెందుతారని, కానీ శరీరంలో వైరస్ చైతన్యవంతంగా ఉండదని నిపుణులు వివరిస్తున్నారు.


గణాంకాలు, ముప్పు ఎవరికి ఎక్కువ?

అధ్యయనాల ప్రకారం, చికున్‌గున్యా సోకిన వారిలో దాదాపు 10 నుంచి 15 శాతం మంది ఒక సంవత్సరానికి పైగా దీర్ఘకాలిక కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. కొందరిలో ఈ నొప్పులు 36 నెలల (3 సంవత్సరాల) వరకు కూడా తిరగబెడుతున్నట్లు నివేదికలు ఉన్నాయి. 45 ఏళ్లు పైబడిన వారు, మహిళలు, ఇప్పటికే కీళ్ల వాతం వంటి సమస్యలు ఉన్నవారిలో ఈ ముప్పు ఎక్కువగా ఉంటుంది. వాతావరణ మార్పులు, అధిక శ్రమ, మానసిక ఒత్తిడి లేదా ఇతర ఇన్‌ఫెక్షన్లు సోకినప్పుడు ఈ నొప్పులు మళ్లీ తీవ్రమయ్యే అవకాశం ఉంది.



నిర్వహణ.. చికిత్స

ఈ దీర్ఘకాలిక నొప్పులు తిరగబెట్టినప్పుడు సొంత వైద్యం చేసుకోకుండా తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలి. వైద్యుల పర్యవేక్షణలో నాన్-స్టిరాయిడల్ యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్ వాడాల్సి ఉంటుంది. సమస్య తీవ్రంగా ఉన్నవారికి డిసీజ్-మాడిఫైయింగ్ ఏజెంట్లు వంటి శక్తివంతమైన మందులను సూచిస్తారు. వీటితో పాటు, కీళ్లపై భారం పడని తేలికపాటి వ్యాయామాలు, ఫిజికల్ రిహాబిలిటేషన్, యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ జీవనశైలిని అలవర్చుకోవడం చాలా ముఖ్యం. చికున్‌గున్యా నుంచి కోలుకున్న 4 నుంచి 6 వారాల తర్వాత కూడా నొప్పి తగ్గకపోతే, లేదా కీళ్లలో స్పష్టమైన వాపు, ఎరుపు, ఉదయం పూట కీళ్లు ఎక్కువసేపు బిగుసుకుపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే రుమటాలజిస్ట్‌ను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ నొప్పులు తిరగబెట్టడం వల్ల రోగి నుంచి ఇతరులకు వ్యాధి సంక్రమించదని, ఇది అంటువ్యాధి కాదని గుర్తుంచుకోవాలి.



డైనమిక్ జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE WWW.JANAMVOICE.COM


# గురు నానక్ విద్యాసంస్థలో ఘనంగా 26వ 'ఓరియెంటేషన్ డే'



**ఇబ్రహీంపట్నం, ఆగస్ట్ 14,(జనం వాయిస్ ):** రంగారెడ్డి జిల్లా,ఇబ్రహీంపట్నం సమీపంలోని గురు నానక్ విద్యాసంస్థలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి నూతనంగా ప్రవేశం పొందిన బీ.టెక్ ఇంజినీరింగ్ విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రుల కోసం 26వ ఓరియెంటేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌లోని రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ల్యాబొరేటరీ ప్రాజెక్ట్ డైరెక్టర్, సైంటిస్ట్ జీ ఎస్. శంకరి మరియు ముంబైలోని వర్లీ దూరదర్శన్ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఇంజినీరింగ్) మీనాక్షి సింఘ్వీ, ఐబీ (ఈ )ఎస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థులు తమ



విద్యా ప్రయాణంలో ముఖ్యమైన లక్షణాలలో పట్టుదల, విమర్శలను ఎదుర్కొనే ధైర్యం ప్రధానమైనవని, తమ లక్ష్యాలను సాధించే క్రమంలో ఈ లక్షణాలను జీవితాంతం కొనసాగించాలని సూచించారు. గురు నానక్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ఉన్న అత్యుత్తమ పరిశోధన మరియు అభివృద్ధి (ఆర్ డడి ) సదుపాయాలు, ప్రయోగశాలలను వారు ప్రశంసించారు.విద్యార్థులు మరియు తల్లిదండ్రులను ఉద్దేశించి గురు నానక్ ఇన్‌స్టిట్యూషన్స్ వైస్-చైర్మన్ మరియు గురు నానక్ యూనివర్సిటీ ఛాన్సలర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ మాట్లాడుతూ నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు స్వాగతం పలికారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు వేగంగా మారుతున్నాయని, అందువల్ల ఉన్నత విద్యా వ్యవస్థలోని పాఠ్య ప్రణాళిక మరియు బోధనా విధానాల్లో నిరంతరం మార్పులు అవసరమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి గురు నానక్ ఇన్‌స్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు గురు నానక్ యూనివర్సిటీ వైస్-చాన్సలర్ డా. హెచ్. ఎస్. సైనీ మాట్లాడుతూ సంస్థలో అందుబాటులో ఉన్న ఆధునిక ప్రయోగశాలలు, గ్రంథాలయం మరియు ఇతర విద్యా సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకుని ఉన్నత విజయాలను సాధించేందుకు విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆయన ప్రోత్సహించారు.డైరెక్టర్ డా. ఎస్. శ్రీనాథరెడ్డి, ప్రిన్సిపాల్ డా. బి. వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ.. క్యాంపస్ లో అందుబాటులో ఉన్న వివిధ సదుపాయాల గురించి వివరించారు.ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు ,విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు...

జరగరాని ప్రాణనష్టం జరిగితే బాధ్యులు ఎవరు..?





**ఆగస్టు 14 జనం వాయిస్ పాలకుర్తి:** పాలకుర్తి మండలం శాతపురం గ్రామంలోని ఊర చెరువు కింద విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా వేలాడుతూ ఒకదానిపై ఒకటి అల్లుకొని రైతుల మోటార్లు కాలిపోతున్నాయని ఫోటోలతో సహా విద్యుత్ శాఖ అధికారులకు తెలిపినప్పటికీ పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ట్రాన్స్ఫారం కాలిపోయినప్పటికీ విద్యుత్ అధికారులు లూజ్ పోల్స్ వేసి చర్యలు చేపట్టకపోవడం వారి పనితనానికి నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా లూజు వైర్ల దగ్గర పోల్స్ ఏర్పాటు చేసి ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరగకుండా చూడాలని రైతులు కోరారు.

# విద్యార్థులు క్రమ-శిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

-ఫ్రీవిల్ స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్ కొడిశాల బాబు.




**పాలకుర్తి జన వాయిస్ పాలకుర్తి :** విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకొని, పట్టుదలతో చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఫ్రీవిల్ స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్ కొడిశాల బాబు పిలుపునిచ్చారు.శుక్రవారం పాలకుర్తి మండలంలోని చెన్నూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్)లో సుమారు 150 మంది విద్యార్థులకు ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సేవా భావం పెంపొందించుకోవాలని సూచించారు. కష్టపడి మంచి మార్కులతో చదువుకొని, పాఠశాలకు, జన్మనిచ్చిన తల్లిదండ్రులకు మరియు గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చేలా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్,పీడీ అశోక్,ఫ్రీవిల్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు కొడిశాల వినయ్,మహేందర్ సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు, చిన్నారులు సమస్యలపై నిర్భయంగా ఫిర్యాదు చేయాలి

వేధింపులు సహించవద్దు.. షీ టీమ్స్‌ను ఆశ్రయించండి



**జనం వాయిస్,మందమర్రి, ఆగస్టు 14:** మహిళలు, చిన్నారులు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని మంచిర్యాల జిల్లా షీ టీమ్ పోలీసులు సూచించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, మంచిర్యాల డీసీపీ భాస్కర్ పర్యవేక్షణలో జిల్లా షీ టీమ్ ఎస్ఐ హైమ ఆధ్వర్యంలో మందమర్రిలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ సిబ్బంది మహిళల భద్రత కోసం పోలీసులు చేపడుతున్న చర్యలను వివరించారు. ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, ట్రాఫిక్ నిబంధనలు, టీ-సేఫ్ యాప్, షీ టీమ్ సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఫిర్యాదులు, సమాచారం కోసం డయల్ 100, రామగుండం షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, మంచిర్యాల జిల్లా షీ టీమ్ నంబర్ 8712659385ను సంప్రదించాలని తెలిపారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. మహిళల భద్రతకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రవ్యాప్తంగా పటిష్ట చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులకు గురైనా మౌనంగా ఉండకుండా ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ కానిస్టేబుళ్లు శ్రవణ్, శ్రీలత, పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశ విభజన గాయాలు.. మరువలేని మహా విషాదాలు!

**దేశ విభజన సమయంలో జరిగిన అతిపెద్ద మానవ విషాదాల్లో కొన్నింటికి గుర్తుగా స్మారక దినం**

**షేఖ్‌పురాలో 10,000 మందిని చంపి, మహిళలను అపహరించిన వైనం**

**ముజఫరాబాద్‌లో వెయ్యి మందికి పైగా హిందూ, సిక్కు పురుషులను కాల్చి చంపిన నరమేధం**

**థోహా ఖల్సాలో మానం కాపాడుకునేందుకు బావిలోకి దూకి 90 మంది మహిళల ఆత్మార్పణం**

**గతాన్ని మరువకుండా బాధితులను స్మరించుకోవడమే ఈ దినం ఉద్దేశం**



1947లో జరిగిన భారత విభజన ఆధునిక చరిత్రలోనే ఒక మహా విషాదం. ఈ ఘోరకలిలో లక్షలాది మంది ప్రాణాలు కోల్పోగా, కోట్లాది మంది నిరాశ్రయులయ్యారు. ఇళ్లు, కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి. దోపిడీలు, బలవంతపు మతమార్పిడులు, వర్ణనాతీతమైన హింసకు లెక్కేలేదు. 'విభజన భయానక స్మారక దినం' సందర్భంగా చరిత్ర పుటల్లో మరుగునపడిన కొన్ని అత్యంత దారుణమైన సంఘటనలను గుర్తుచేసుకోవడం అవసరం. ముఖ్యంగా పశ్చిమ ప్రాంతంలో (ప్రస్తుత పాకిస్థాన్) జరిగిన మారణకాండలకు సంబంధించిన ప్రత్యక్ష సాక్షుల కథనాలు మనల్ని కలచివేస్తాయి.

షేఖ్‌పురా నరమేధం

విభజనకు ముందు షేఖ్‌పురాలో ఎలాంటి మత ఘర్షణలు జరగలేదని, అది ముస్లిమేతరులకు బలమైన కోటగా ఉండేదని నాటి న్యాయవాది రామ్ నాథ్ తన కథనంలో పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో 68% ముస్లింలు, 20% సిక్కులు, 12% హిందువులు ఉండేవారు. 1947 ఆగస్టు 15న ముస్లిమేతరుల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పిస్తామని అక్కడి ముస్లిం అధికారులు హామీ ఇచ్చారు. కానీ, విభజన తర్వాత ముస్లిమేతర అధికారులను తొలగించడంతో పరిస్థితి మారిపోయింది.

ఆగస్టు 24 సాయంత్రం కర్ఫ్యూ విధించి, ముస్లిం సైనికులు ఒక ఇంటికి నిప్పుపెట్టారని రామ్ నాథ్ తెలిపారు. ఆ మరుసటి రోజు నుంచి హింస ఒక ప్రణాళిక ప్రకారం జరిగిందని ఆయన వివరించారు. సైనిక సిబ్బంది ఇళ్లలోకి చొరబడి ప్రజలను చంపుతుండగా, మరో బృందం దోపిడీలకు, దహనాలకు పాల్పడింది.

న్యూ ఇహతాస్ అనే ప్రాంతంలో హిందూ, సిక్కు కుటుంబాలను ఒకచోట చేర్చి, పురుషుల నుంచి మహిళలను వేరు చేశారు. యువతులను వారి కుటుంబ సభ్యుల ముందే వేధించారు. ఎదురుతిరిగిన ఒక యువకుడితో పాటు అక్కడున్న పురుషులందరినీ కాల్చి చంపారని ఆయన తన కథనంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సిక్కు రైస్ ఫ్యాక్టరీలో జరిగిన మారణహోమం అత్యంత దారుణమని, అక్కడ పురుషులను వేరు చేసి కాల్చి చంపారని తెలిపారు. ఆగస్టు 26 నాటికి సుమారు 10,000 మంది పురుషులను చంపి, ట్రక్కుల కొద్దీ యువతులను అపహరించుకుపోయారని ఆయన పేర్కొన్నారు.

ముజఫరాబాద్ మారణకాండ

1947 అక్టోబర్‌లో పఠాన్ దుండగులు తమ గ్రామంపై దాడి చేశారని ముజఫరాబాద్‌కు చెందిన ఖజాన్ సింగ్ తన సాక్ష్యంలో తెలిపారు. ఈ దాడిలో 20 మంది చనిపోగా, మిగిలిన వారు ప్రాణభయంతో పారిపోయారు. అలా పారిపోతున్న హిందూ, సిక్కు కుటుంబాలను దుండగులు చుట్టుముట్టి డోమెల్ అనే ప్రాంతానికి తరలించారు.

అక్కడ పురుషులను, మహిళలు-పిల్లలను వేరు చేసి, పురుషులందరినీ వరుసలో నిలబెట్టి కాల్చి చంపారని ఖజాన్ సింగ్ వివరించారు. వారి మృతదేహాలను నదిలో పడేశారని, ఆ రోజు వెయ్యి మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని అంచనా వేశారు. పిల్లలను కూడా వదలకుండా చంపేశారని ఆయన కన్నీటిపర్యంతమయ్యారు. తనను బంధించి బలవంతంగా ఇస్లాంలోకి మార్చారని, తర్వాత పాకిస్థాన్ సైనికుల సహాయంతో తప్పించుకున్నానని ఆయన తెలిపారు.

థోహా ఖల్సా విషాదం

రావల్పిండి జిల్లాలోని థోహా ఖల్సా గ్రామంలో జరిగిన విషాదం అత్యంత హృదయవిదారకమైనది. ఒక పెద్ద సాయుధ గుంపు గ్రామాన్ని చుట్టుముట్టడంతో గ్రామస్థులు ప్రతిఘటించారు. చర్చల తర్వాత రూ.10,000 ఇస్తే వదిలేస్తామని దుండగులు చెప్పడంతో గ్రామస్థులు ఆ మొత్తం చెల్లించారు.

కానీ, మరుసటి రోజు దుండగులు మళ్లీ వచ్చి దాడి చేసి 40 మంది గ్రామ రక్షకులను చంపేశారు. ఇక తమను తాము రక్షించుకోలేమని, శత్రువుల చేతిలో చిక్కితే తమ మానం దక్కదని భావించిన ఆ గ్రామ మహిళలు అత్యంత కఠినమైన నిర్ణయం తీసుకున్నారు. సుమారు 90 మంది మహిళలు తమను తాము కాపాడుకోవడానికి అక్కడున్న ఒక బావిలోకి దూకి ఆత్మార్పణం చేసుకున్నారు. వారిలో కేవలం ముగ్గురు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు.

విభజన కేవలం భౌగోళిక మార్పు కాదు, అది తరతరాలుగా కలిసి బతుకుతున్న లక్షలాది మంది జీవితాలను ఛిద్రం చేసిన పెను విషాదం. ఈ దినం ఉద్దేశం విద్వేషం పెంచడం కాదు, బాధితులను స్మరించుకోవడం, వారి కథలను సజీవంగా ఉంచడం, చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవడం. గతాన్ని నిజాయతీగా గుర్తుంచుకోవాలి. గతాన్ని మరచిన వారు అలాంటి తప్పులను పునరావృతం చేసే ప్రమాదం ఉంది.

# సైన్యం కన్నా రైల్వేలపైనే కన్ను.. ఐఎస్ఐ వ్యూహం మార్చిందా?

భారత రైల్వే నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకుని ఐఎస్ఐ భారీ కుట్ర

దాడులే కాకుండా, తప్పుడు సమాచారంతో భయాందోళనలు సృష్టించే పన్నాగం

సైనిక స్థావరాల కంటే ఎక్కువగా రైల్వేలపై సమాచారం సేకరణ

స్వాతంత్ర్య దినోత్సవాన్ని లక్ష్యంగా చేసుకుని ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో దాడులకు ఆస్కారం

రూ.3,000 వంటి స్వల్ప మొత్తానికే ఏజెంట్ల నియామకం

భారత రైల్వే స్టేషన్లలో నిఘా




దేశానికి జీవనాడి అయిన భారతీయ రైల్వే వ్యవస్థపై పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ (ఐఎస్ఐ) భారీ కుట్రకు తెరలేపినట్లు భారత నిఘా వర్గాలు సంచలన విషయాలు వెల్లడించాయి. రైల్వేలు ఇటీవల కాలంలో ఉగ్రవాదుల ప్రధాన లక్ష్యంగా మారాయని, దేశవ్యాప్తంగా భయాందోళనలు సృష్టించేందుకు ఐఎస్ఐ ఒక పక్కా వ్యూహంతో ముందుకెళుతోందని ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) తన నివేదికలో హెచ్చరించింది. స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తున్న తరుణంలో ఈ హెచ్చరికలు తీవ్ర ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఐబీ అధికారుల ప్రకారం.. ఐఎస్ఐ తన గూఢచర్య కార్యకలాపాలను ప్రధానంగా భారత సైన్యం, రైల్వేలపైనే కేంద్రీకరించింది. అయితే, ఇటీవలి కాలంలో ఈ వ్యూహంలో స్పష్టమైన మార్పు కనబడుతోంది. సైనిక స్థావరాలపై సమాచారం సేకరణ దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా ఉండగా, రైల్వేలపై మాత్రం తక్షణ దాడులు చేయాలనే ఉద్దేశంతో సమాచారాన్ని సేకరిస్తున్నారు. దేశ రవాణా వ్యవస్థకు రైల్వేలు వెన్నెముక అని, వాటిని దెబ్బతీస్తే ప్రజల్లో తీవ్ర భయాందోళనలు సృష్టించవచ్చని ఐఎస్ఐ భావిస్తోంది. ఈ కుట్రలో భాగంగా ఐఎస్ఐ రెండు రకాల వ్యూహాలను అమలు చేస్తోంది. ఒకటి, రైల్వే స్టేషన్లు, ట్రాక్‌లపై నేరుగా దాడులు చేయడం. రెండోది, ప్రజలను మానసికంగా దెబ్బతీసేందుకు 'మైండ్ గేమ్స్' ఆడటం. ఇందుకోసం ప్రత్యేకంగా కొందరిని నియమించుకుని, రద్దీగా ఉండే రైల్వే స్టేషన్లలో బాంబు బెదిరింపుల వంటి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయిస్తున్నారు. ఇలాంటి పుకార్లతో ఒక్కసారిగా తొక్కిసలాట జరిగి, ఎలాంటి దాడి లేకుండానే భారీ ప్రాణనష్టం కలిగించవచ్చని అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ కుట్ర కోసం గత ఏడాది కాలంగా ఐఎస్ఐ నిఘాను పది రెట్లు పెంచింది. కేవలం రూ.3,000 వంటి స్వల్ప మొత్తానికే కొందరు యువకులను ఏజెంట్లుగా నియమించుకుని, వారి ద్వారా రైల్వే స్టేషన్లలోని కీలక ప్రదేశాలను ఫొటోలు తీయించడం, భద్రతా ఏర్పాట్లను అంచనా వేయించడం వంటివి చేస్తోంది. మరింత పక్కాగా సమాచారం కోసం కొన్ని రైల్వే స్టేషన్లలో సోలార్ పవర్ ఆధారిత సీసీటీవీ కెమెరాలను కూడా రహస్యంగా ఏర్పాటు చేయించినట్లు దర్యాప్తులో తేలింది. ఒక్కో కెమెరా అమర్చినందుకు రూ.5,000 నుంచి రూ.10,000 వరకు చెల్లించినట్లు అధికారులు గుర్తించారు. ఈ దాడులకు ఇస్లామిస్ట్ గ్రూపులతో పాటు పంజాబ్, హర్యానాల్లో రైల్వేలను లక్ష్యం చేసుకునేందుకు 'బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్' (బీకేఐ) వంటి సంస్థలను కూడా ఐఎస్ఐ వాడుకుంటోందని తెలిసింది. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సమయంలో భద్రతా బలగాలు ఢిల్లీపై ఎక్కువగా దృష్టి సారిస్తాయని, ఇదే అదనుగా రైల్వే వ్యవస్థపై దాడికి ఉగ్రమూకలు ప్రయత్నించవచ్చని ఐబీ హెచ్చరించింది. దీంతో ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాల్లోని రైల్వే స్టేషన్లలో హై అలర్ట్ ప్రకటించి భద్రతను కట్టుదిట్టం చేశారు.

# హల్ద్వానీ ఘటనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ సత్యాగ్రహ దీక్ష



జనం వాయిస్,మందమర్రి, ఆగస్టు 14: హల్ద్వానీ ఘటనకు వ్యతిరేకంగా టీపీసీసీ ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మందమర్రి మండలం అదిల్‌పేట గ్రామంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. ముందుగా పాదయాత్ర నిర్వహించిన అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ముందు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. హల్ద్వానీలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న కార్యక్రమం జరిగిన ప్రదేశాన్ని 'శుద్ధీకరణ' పేరుతో శుభ్రపరిచిన ఘటనను కాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా ఖండించారు. ఇలాంటి చర్యలు సామాజిక వివక్షను ప్రోత్సహించే విధంగా ఉన్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అందించిన సమానత్వం, సామాజిక న్యాయం, మానవ గౌరవం వంటి రాజ్యాంగ విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని అన్నారు. మల్లికార్జున్ ఖర్గేకు సంఘీభావంగా, వివక్షకు వ్యతిరేకంగా అంబేద్కర్ విగ్రహం ముందు సత్యాగ్రహ దీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్, అదిల్‌పేట, పొన్నారం, వెంకటాపూర్, మామిడిగట్టు, చిర్రకుంట గ్రామాల సర్పంచ్‌లు, మండల కాంగ్రెస్ కమిటీ ప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# రిటైరయ్యాక రోహిత్‌ను వదలొద్దు.. కోచ్‌గా కోహ్లీ సిద్ధంగా లేడు: అశ్విన్



టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ భారత క్రికెట్ దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ భవిష్యత్ పాత్రలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ.. వీరిద్దరి కోచింగ్ భవిష్యత్‌పై తన అంచనాలను పంచుకున్నాడు. రోహిత్ శర్మ కోచ్‌గా మారే అవకాశాలున్నాయని, అయితే విరాట్ కోహ్లీ మాత్రం అందుకు సిద్ధంగా ఉండకపోవచ్చని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా రోహిత్ రిటైర్ కాగానే అతడి సేవలను వినియోగించుకోవాలని ముంబై ఇండియన్స్‌కు కీలక సూచన చేశాడు. రోహిత్ శర్మ వ్యూహాత్మక నైపుణ్యాలను ప్రశంసిస్తూ.. "రేపు రోహిత్ ఆడనని నిర్ణయించుకుంటే, ముంబై ఇండియన్స్ అతడిని తక్షణమే తీసుకోవాలి. ఐదుసార్లు ఐపీఎల్ టైటిళ్లు గెలిపించి, భారత్‌కు ప్రపంచకప్ అందించిన కెప్టెన్ సేవలను వదులుకోకూడదు. అలాంటి వ్యక్తులు సులభంగా దొరకరు. ఒకవేళ హెడ్ కోచ్ పాత్ర శ్రమతో కూడుకున్నదని అతను భావిస్తే, ఒకటి రెండేళ్ల విరామం తర్వాత ఏదో ఒక పాత్రలో తిరిగి వస్తాడు. రాహుల్ ద్రవిడ్ కూడా విరామం తీసుకుని వచ్చాడు. ముంబై ఇండియన్స్ యాజమాన్యం తీరు చూస్తే, రోహిత్ శర్మ లాంటి ఆలోచనాపరుడిని వారు వదులుకుంటారని నేను అనుకోవడం లేదు" అని అశ్విన్ వివరించాడు. మరోవైపు విరాట్ కోహ్లీ గురించి మాట్లాడుతూ.. "నా అభిప్రాయం ప్రకారం, విరాట్ వెంటనే కోచింగ్ బాధ్యతలు చేపట్టడానికి సిద్ధంగా ఉండడు. ఇద్దరూ కెరీర్‌లో చాలా కష్టపడ్డారు. విరాట్ తన సుదీర్ఘ, తీవ్రమైన కెరీర్ తర్వాత కచ్చితంగా విరామం తీసుకోవాలనుకుంటాడు" అని అశ్విన్ అంచనా వేశాడు. 39 ఏళ్ల రోహిత్ శర్మ ఇప్పటికే టెస్టులు, టీ20ల నుంచి రిటైర్ అయిన నేపథ్యంలో అతని పోస్ట్-రిటైర్మెంట్ కెరీర్‌పై ఈ చర్చ ప్రాధాన్యత సంతరించుకుంది. భవిష్యత్తులో క్రికెట్ స్వరూపం మారనుందని, ఫ్రాంచైజీ క్రికెట్ ఆధిపత్యం చెలాయిస్తుందని అశ్విన్ జోస్యం చెప్పాడు. ఈ క్రమంలో హెడ్ కోచ్‌తో పాటు మెంటార్, డైరెక్టర్ ఆఫ్ క్రికెట్, హై-పెర్ఫార్మెన్స్ డైరెక్టర్ వంటి ప్రత్యేకమైన పదవులు ప్రాచుర్యం పొందుతాయని, ఇది రిటైరైన స్టార్ ఆటగాళ్లకు అద్భుతమైన అవకాశాలను అందిస్తుందని పేర్కొన్నాడు.


డైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక
RNI NO: TGTEL/26/A0383
DYNAMIC JANAMVOICE WWW.JANAMVOICE.COM


# ఆడ్రి హెప్బర్న్ స్టైల్ రిమైండ్.. తారా సుతారియా లుక్ వైరల్!




యశ్ సరసన నటించిన మోస్ట్ అవేటెడ్ మూవీ 'టాక్సిక్' గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతున్న వేళ, బాలీవుడ్ బ్యూటీ తారా సుతారియా తన లేటెస్ట్ ఫోటోషూట్‌తో సోషల్ మీడియాను ఊపేస్తోంది. క్లాసిక్ గ్రాండ్ పియానో పక్కన నిలబడి ఆకర్షణీయమైన పోజులిచ్చిన ఈ పిక్స్ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. "1950ల కాలంలోనే చిక్కుకుపోయాను (ఎప్పటికీ బయటకు రాను)" అనే డిఫరెంట్ క్యాప్షన్‌తో ఆమె పోస్ట్ చేసిన ఈ రెట్రో పిక్స్ ప్రస్తుతం ఇంటర్నెట్‌లో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. చాశ్రీంశీ =ఘు - దేవిశ్రీ ప్రసాద్ వదిలిన బ్లాక్ షీప్ పార్టీ సాంగ్.. ఎలా ఉందంటే.. పాత హాలీవుడ్ శైలిలో కన్నులవిందు: ఈ సరికొత్త ఫోటోషూట్‌లో తారా సుతారియా నలుపు రంగు లేస్ గౌన్‌లో అత్యంత రాయల్ లుక్‌లో దర్శనమిచ్చారు. ఈ రాయల్ అటైర్‌కు తోడు మెడలో ముత్యాల చోకర్, దానికి సరిపోయే ఇయర్ రింగ్స్ ధరించి మరింత ఎలిగెంట్‌గా మెరిసిపోయారు. ఇక ఆమె హెయిర్ స్టైల్, గ్లామరస్ పోజులు అప్పట్లో హాలీవుడ్ లెజెండరీ నటి 'ఆడ్రి హెప్బర్న్' క్రియేట్ చేసిన ఐకానిక్ రెట్రో వైబ్‌ను, ఓల్డ్ హాలీవుడ్ గ్లామర్‌ను గుర్తుచేస్తున్నాయని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. పియానో పక్కన రాయల్ పోజులు: ఫోటోలలో పియానో పక్కన నిలబడి తారా ఇచ్చిన పోజులు వింటేజ్ క్లాస్ లుక్‌కు పర్ఫెక్ట్ ఉదాహరణగా నిలిచాయి. ఇక పాతకాలపు క్లాసిక్ వాతావరణాన్ని తలపించేలా తీర్చిదిద్దిన ఈ పిక్స్, ఆమెలోని రాయల్ ఫ్యాషన్ సెన్స్‌ను ఎలివేట్ చేస్తున్నాయి. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కొద్ది సమయాల్లోనే లక్షలాది లైక్‌లు, కామెంట్లతో ఈ ఫోటోలు వైరల్‌గా మారాయి.

'టాక్సిక్' ప్రాజెక్ట్‌తో బిజీ బిజీగా తారా: ఈ ఏడాది అత్యంత భారీ అంచనాలతో రాబోతున్న సినిమాల్లో 'టాక్సిక్' ఒకటి. ఒకవైపు వెండితెరపై భారీ ప్రాజెక్ట్‌లతో అలరించేందుకు సిద్ధమవుతూనే, మరోవైపు తన ఫ్యాషన్ గేమ్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది ఈ భామ. కేవలం నటిగానే కాకుండా, ఇండస్ట్రీలో ఒక ఐకానిక్ ఫ్యాషన్ దివాగా కూడా తారా సుతారియా తన ప్రత్యేక ముద్రను వేస్తోంది. స్టైల్, ఎలిగెన్స్, గ్లామర్ కలబోతగా నిలిచిన తారా సుతారియా లేటెస్ట్ ఫోటోషూట్ నెటిజన్లకు వింటేజ్ పండగను అందిస్తోంది. ఇక 1950ల నాటి హాలీవుడ్ వైబ్‌ను రీక్రియేట్ చేస్తూ ఆమె ఇచ్చిన పోజులు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. నటనలోనే కాక ఫ్యాషన్ విషయంలోనూ తనకు సాటిలేరని తారా సుతారియా ఈ రాయల్ పోర్ట్రెట్లతో మరోసారి నిరూపించారు.



# వేగం పెంచిన 'ధర్మన్'..




## సెకండ్ షెడ్యూల్‌లో అడుగుపెట్టిన రజనీకాంత్

సూపర్ స్టార్ రజనీకాంత్ 'ధర్మన్' నేడు రెండో షెడ్యూల్ ప్రారంభం

కమల్ హాసన్ నిర్మాణంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం

సెట్స్ పై రజనీ ఉన్న వీడియో క్లిప్ విడుదల చేసిన మేకర్స్

అశ్వత్ మరిముత్తు దర్శకత్వంలో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా మూవీ

నేరస్థులను ఎదుర్కొనే డాక్టర్ పాత్రలో కనిపించనున్న రజనీకాంత్

సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా, దర్శకుడు అశ్వత్ మరిముత్తు తెరకెక్కిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ధర్మన్' సినిమా షూటింగ్ వేగం పుంజుకుంది. ఈ చిత్రం రెండో షెడ్యూల్ చిత్రీకరణ నేడు ప్రారంభమైనట్టు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాను సీనియర్ నటుడు కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న విషయం తెలిసిందే. షూటింగ్ ప్రారంభంపై చిత్ర నిర్మాణ సంస్థ సోషల్ మీడియా వేదికగా ఒక ప్రత్యేక వీడియో క్లిప్‌ను పంచుకుంది. "ది డెడ్లీ డాక్టర్.. 'ధర్మన్' షెడ్యూల్ 2 మొదలైంది, ఇది ఒక లెజెండరీ" అంటూ పోస్ట్ చేసింది. విడుదల చేసిన వీడియోలో సూపర్ స్టార్ రజనీకాంత్ సెట్స్‌లో ఉండగా, దర్శకుడు అశ్వత్ మరిముత్తు ఆయనతో చర్చిస్తున్న దృశ్యాలు కనిపించాయి. ఈ అప్‌డేట్‌తో అభిమానుల్లో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ ప్రాజెక్ట్ ప్రకటించినప్పటి నుంచి సినిమాపై భారీ ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది జూన్‌లో చిత్ర యూనిట్ ఒక మేకింగ్ వీడియోను విడుదల చేసింది. అందులో సినిమా కోసం రజనీకాంత్ లుక్‌ను ఎలా ఫైనల్ చేశారో చూపించారు. దర్శకుడు అశ్వత్ మరిముత్తు సైతం "ఇదే హెయిర్ స్టైల్, ఇదే లుక్" అంటూ రజనీ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. అంతకుముందు "ది ఓజీ స్వాగ్" పేరుతో విడుదలైన మరో వీడియోలో ఫస్ట్ లుక్ కోసం రజనీకాంత్ కాస్ట్యూమ్స్, యాక్సెసరీస్ ఎంపిక చేసే విధానాన్ని, కమల్ హాసన్ కూడా సెట్స్‌కు వచ్చి రజనీతో ముచ్చటించడం వంటి సన్నివేశాలు చూపించారు. ఈ చిత్రంలో రజనీకాంత్ ఒక డాక్టర్‌గా నటిస్తూ, సమాజంలోని నేరస్థులను ఎదుర్కొనే పాత్రలో కనిపించనున్నారు. గతంలో సినిమా టైటిల్ ప్రకటిస్తూ కమల్ హాసన్ "ధర్మమే వెల్లుమ్!" (ధర్మమే గెలుస్తుంది) అని ట్వీట్ చేశారు. విడుదలైన టైటిల్ పోస్టర్‌లో రజనీకాంత్ ఆపరేషన్ థియేటర్‌లో స్కాల్‌పెల్ పట్టుకుని, ఒక రౌడీ షీటర్ శరీరంపై కాలు వేసి నిలబడినట్టుగా కనిపించడం సినిమాపై క్యూరియాసిటీని పెంచింది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రాఫర్‌గా, ప్రదీప్ ఇ. రాఘవ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీతలు అన్బరివ్ స్టంట్స్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ ఈ సినిమాను నిర్మిస్తుండగా, ఎస్. డిస్నీ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.




# నాలుగు నెలల ముందుగానే బరిలోకి మహేష్-రాజమౌళి!



భారతీయ చలనచిత్ర పరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న -వారణాసి-పై ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. భారీ బడ్జెట్‌తో, సరికొత్త అడ్వెంచర్ జోనర్‌లో రూపొందుతున్న సినిమాకు సంబంధించి మేకర్స్ వినూత్నమైన ప్రచార వ్యూహానికి తెరతీశారు. సాధారణంగా సినిమా విడుదలకు కొన్ని వారాల ముందు ప్రచారం ప్రారంభించడం టాలీవుడ్‌లో ఆనవాయితీగా కనిపిస్తుంది. కానీ -వారణాసి- విషయంలో మాత్రం ఏకంగా నాలుగు నెలల ముందే ప్రచార పర్వాన్ని ప్రారంభించాలని చిత్రబృందం నిర్ణయించినట్లు సమాచారం. ఈ భారీ ప్రాజెక్ట్‌ను వచ్చే ఏడాది ఏకకాలంలో 120 దేశాల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. గ్లోబల్ మార్కెట్‌ను టార్గెట్ చేస్తూ ప్లాన్ చేస్తున్న చిత్రానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేకమైన క్రేజ్ తీసుకురావడమే ముందస్తు ప్రణాళిక ప్రధాన ఉద్దేశం. హాలీవుడ్ స్థాయి సినిమాలకు దీటుగా ప్రమోషన్స్ నిర్వహించాలని భావిస్తున్న రాజమౌళి అండ్ టీమ్ ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేక్షకులను థియేటర్ల వైపు ఆకర్షించేందుకు పక్కా ప్లాన్‌తో ముందుకు వెళ్తున్నారు. ఈ గ్లోబల్ ప్రచార వ్యూహంలో భాగంగా కొన్ని ప్రత్యేక దేశాలను ఎంపిక చేసి అక్కడ స్పెషల్ ప్రమోషనల్ ఈవెంట్లను ప్లాన్ చేస్తున్నారుట. ఆయా దేశాల్లోని ప్రముఖ మీడియా సంస్థలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు , ఇంటర్నేషనల్ బాక్సాఫీస్ ట్రెండ్స్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ క్యాంపెయిన్ సాగనుంది. మహేష్ ఇమేజ్‌ను గ్లోబల్ స్థాయిలో మరింత ఇనుమడింపజేసేలా సినిమాలోని విజువల్స్ ..మేకింగ్ వీడియోలను దశలవారీగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారుట. ఇప్పటికే సినిమా కోసం మహేష్ జర్మనీలోని బ్లాక్ ఫారెస్ట్ ప్రాంతంలో కఠినమైన ట్రెయినింగ్ తీసుకోవడం, చిత్రానికి సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ వర్క్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగడం వంటి అంశాలు సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి. రాజమౌళి టేకింగ్, విజయేంద్ర ప్రసాద్ కథా బలంతో వస్తున్న చిత్రం ఇండియన్ సినిమా కీర్తిని విశ్వవ్యాప్తం చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. నాలుగు నెలల ముందే ప్రారంభమయ్యే ఈ ప్రచార జోరుతో సినిమాపై హైప్ అంతకంతకూ పెరుగుతుంది. ఇదే నిజమైతే? ఇంత భారీ స్థాయిలో ఒక సినిమాకు గ్లోబల్ మార్కెటింగ్ చేయడం ఇదే మొదటిసారని చెప్పొచ్చు. కేవలం దేశీయ మార్కెట్ మాత్రమే కాకుండా ఓవర్సీస్ లోనూ భారీ కలెక్షన్లను రాబట్టడమే లక్ష్యంగా ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. సినిమా విడుదలకు ముందే ప్రేక్షకులలో పండుగ వాతావరణాన్ని సృష్టించడమే కాకుండా సినిమా కథా ప్రపంచంలోకి ప్రేక్షకులను మానసికంగా కనెక్ట్ చేసేందుకు సుదీర్ఘ ప్రచార ప్రణాళిక ఎంతగానో ఉపయోగపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఈ అనుకోని విరామంతో భయంగా ఉంది

: రష్మిక మందన్న

తుంటి ఎముక గాయంతో విశ్రాంతి తీసుకుంటున్న నటి రష్మిక

ఒకప్పుడు ఆగకుండా పనిచేయడం ఇష్టం, ఇప్పుడు ఆ ఆలోచనే భయమేస్తోందన్న నటి

గాయం వల్ల వచ్చిన విరామం తన ఆలోచనా విధానాన్ని మార్చిందని వెల్లడి

ప్రస్తుతం కుటుంబం, పెంపుడు కుక్కతో సమయం గడుపుతున్నట్టు పోస్ట్

'మైసా' సినిమా షూటింగ్‌లో రష్మికకు గాయం





ప్రముఖ నటి రష్మిక మందన్న ఇటీవల తుంటి గాయానికి గురై ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ ఊహించని విరామం వృత్తిపరమైన పని, వ్యక్తిగత జీవితంపై తన దృక్పథాన్ని ఎలా మార్చిందో ఆమె సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఒకప్పుడు విరామం లేకుండా నిరంతరం పనిచేయడాన్ని ఇష్టపడిన తనకు, ప్రస్తుతం ఆ ఆలోచనే ఆందోళన కలిగిస్తోందని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో రష్మిక ఒక ఆసక్తికర పోస్ట్‌ను పంచుకున్నారు. "క్షణం తీరిక లేకుండా ని ం ం త ం ం పనిచేస్తున్నప్పుడు, అకస్మాత్తుగా వేగాన్ని తగ్గించడం భయంగా అనిపిస్తుంది. కానీ, అనుకోని పరిస్థితుల వల్ల నెమ్మదించాల్సి వచ్చినప్పుడు, గతంలో చేసిన ఆ తీవ్రమైన శ్రమ (హస్లింగ్) ఇప్పుడు భయాన్ని కలిగిస్తోంది. బహుశా ఇదే జీవితం కావచ్చు" అని రష్మిక రాసుకొచ్చారు. తన కుటుంబ సభ్యులతో గడుపుతున్న కొన్ని ఫోటోలను కూడా ఆమె షేర్ చేశారు. తాను ప్రస్తుతం ప్రేమ, సానుకూలత, ప్రార్థనల మధ్య ఉన్నానని చెబుతూ, అభిమానుల ఆదరాభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. తన ఆరోగ్య పరిస్థితి గురించి కొద్ది రోజుల క్రితమే స్పందించిన రష్మిక, ప్రస్తుతం తగినంత విశ్రాంతి తీసుకోవడం, పుస్తకాలు చదవడం, పజిల్స్ ఆడటం, తన పెంపుడు కుక్క 'ఆరా'తో సమయం గడపడమే తన దినచర్యగా మారిందని తెలిపారు. అలారం అవసరం లేకుండా నిద్రలేవడం తన శరీరానికి ఎంతో మేలు చేస్తోందని, అప్పుడప్పుడు పని వేగాన్ని తగ్గించడం అంత చెడ్డదేమీ కాదని తాను గ్రహించినట్టు ఆమె పేర్కొన్నారు. 'పుష్ప', 'యానిమల్' చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన రష్మిక, తన తదుపరి చిత్రం 'మైసా' షూటింగ్ సమయంలో గాయపడ్డారు.




## సినిమా రంగంలో అతి పెద్ద వయసు 'జెన్ జీ' నేనే: కమల్ హాసన్ ఆసక్తికర వ్యాఖ్యలు

సినిమా రంగంలో 67 ఏళ్లు పూర్తి చేసుకున్న కమల్ హాసన్

ఈ ప్రయాణంలో నేర్చుకుంది కేవలం 20 ఏళ్లేనని వ్యాఖ్య

సినిమాలో తానే అత్యంత వయసున్న జెన్ ్గ అని పోస్ట్

సినీ చరిత్రలో సగానికి పైగా తన ప్రస్థానం కొనసాగిందని వెల్లడి

తన సినీ ప్రయాణంపై సోషల్ మీడియాలో ఆసక్తికర విశ్లేషణ



విలక్షణ నటుడు కమల్ హాసన్ సినీ రంగ ప్రవేశం చేసి 67 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సుదీర్ఘ ప్రయాణంపై ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఆసక్తికరమైన విశ్లేషణ చేశారు. దశాబ్దాల అనుభవం ఉన్నప్పటికీ, మారుతున్న చిత్ర పరిశ్రమకు అనుగుణంగా నిరంతరం నేర్చుకుంటూనే ఉంటానని చెబుతూ.. తనను తాను సినిమా రంగంలోని "అత్యంత పెద్ద వయసు జెన్ ్గ" గా అభివర్ణించుకున్నారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా కమల్ హాసన్ తన అభిప్రాయాలను పంచుకున్నారు. "నా 67 ఏళ్ల సినీ ప్రస్థానానికి శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఈ 67 ఏళ్లలో నేను నిజంగా నేర్చుకున్నది కేవలం 20 సంవత్సరాలే అని భావిస్తున్నాను. మిగిలిన సమయం మురుగునీటి ప్రవాహంలో కొట్టుకుపోవడమే. కళాకారులు, ప్రేక్షకులు అందరం కలిసికట్టుగా సినిమా అనే సముద్రంలో కలిసేందుకు ప్రవహిస్తున్నాం. అదొక గొప్ప ఆశ" అని తనదైన తాత్విక ధోరణిలో పేర్కొన్నారు. అంతేకాదు, సినిమా చరిత్రను కూడా ఆయన గుర్తుచేశారు. "1895 డిసెంబర్‌లో లూమియర్ బ్రదర్స్ తొలిసారిగా చిత్రాన్ని ప్రదర్శించారు. అప్పటి నుంచి సినిమా పరిశ్రమకు సుమారు 130 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ మొత్తం సినీ చరిత్రలో సగానికి పైగా, అంటే 67 ఏళ్లుగా నేను ఈ రంగంలోనే ఉన్నానని నా బృందం గుర్తు చేసింది. ఇది నమ్మశక్యం కాని ఆలోచన. అయినా నేను నేర్చుకున్నది 20 ఏళ్లే" అని ఆయన తన పోస్టులో వివరించారు.

కమల్ హాసన్ కేవలం ఆరేళ్ల వయసులో "కళత్తూర్ కన్నమ్మ" చిత్రంతో బాలనటుడిగా వెండితెర అరంగేట్రం చేశారు. తొలి చిత్రానికే రాష్ట్రపతి స్వర్ణ పతకాన్ని గెలుచుకుని చరిత్ర సృష్టించారు. అప్పటి నుంచి నేటి వరకు తమిళ, తెలుగు, మలయాళ, హిందీ, కన్నడ, బెంగాలీ భాషల్లో 230కి పైగా చిత్రాల్లో నటించి భారతీయ సినిమా గర్వించదగ్గ నటులలో ఒకరిగా నిలిచారు. 67 ఏళ్ల తర్వాత కూడా నేర్చుకోవాలనే తన తపనను ఈ పోస్ట్ ద్వారా ఆయన చాటుకున్నారు.



# నన్ను ఆమెతో పోల్చడం బాధ్యతను పెంచింది




కంటెంట్ ప్రాధాన్యమున్న చిత్రాలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న నటి కామాక్షి భాస్కర్ల. 'పొలిమేర' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న ఆమె, తాజాగా 'అగధ' అనే మరో ఆసక్తికరమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ప్రముఖ దర్శకుడు ఎం.ఎస్. రాజు తెరకెక్కించిన ఈ చిత్రం రేపు (ఆగస్ట్ 14) విడుదల కానుంది. ఈ నేపథ్యంలో కామాక్షి మీడియాతో ముచ్చటించి సినిమా విశేషాలను, తన వ్యక్తిగత ప్రయాణాన్ని పంచుకున్నారు. ఈ సినిమాలోని 'మహాదేవి' పాత్ర కోసం తాను బౌద్ధ మతానికి సంబంధించిన పుస్తకాలు చదవడమే కాకుండా, బ్లాక్ మ్యాజిక్ గురించి కూడా తెలుసుకున్నానని ఆమె చెప్పిన విషయాలు ఆసక్తికరంగా మారాయి. మహాదేవి పాత్ర కోసం సిద్ధమవ్వడం ఒక పెద్ద సవాల్ అని కామాక్షి తెలిపారు. "ఆ పాత్ర కోసం నేను కామాక్షిని పూర్తిగా పక్కన పెట్టాల్సి వచ్చింది. నా సొంత వ్యక్తిత్వాన్ని, సిద్ధాంతాలను వదిలి ఆ పాత్రలోకి మారడానికి కాస్త ఇబ్బంది పడ్డాను. ప్రతి ముద్ర, ఆ పాత్ర నడవడిక గురించి లోతుగా అర్థం చేసుకుని నటించాను. సినిమాలో ఎక్కడా కామాక్షి కనిపించకూడదని జాగ్రత్త పడ్డాను" అని ఆమె వివరించారు. తన అభిమాన దర్శకుడు ఎం.ఎస్. రాజు నుంచి ఫోన్ రావడం ఎంతో సంతోషాన్నిచ్చిందని, ఆయన తీసిన 'మనసంతా నువ్వే' తన ఆల్ టైం ఫేవరేట్ అని తెలిపారు. సీనియర్ నిర్మాత శ్యాం ప్రసాద్ రెడ్డి తనను అనుష్కతో పోల్చడంపై స్పందిస్తూ, "అంత పెద్ద నిర్మాత అలా అనడం ఆనందంగా ఉంది. ఆయన అనుష్క గారితో పోల్చడం నా బాధ్యతను మరింత పెంచింది" అని నవ్వుతూ చెప్పారు. తన తొమ్మిదేళ్ల సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ కామాక్షి భావోద్వేగానికి గురయ్యారు. "మగవాళ్లు చేస్తే మేల్ సెంట్రిక్ అనరు, కానీ మహిళలు చేస్తే ఫిమేల్ సెంట్రిక్ అంటారు. నేను సినిమాల కోసం ఎంతో కష్టపడ్డాను. ఇప్పటికీ నాకు కారు లేదు, బైక్ మీదే వస్తాను. ప్రొడక్షన్ వాళ్లు ఇచ్చే వాహనం కూడా నాకు కొత్తగా అనిపిస్తుంది. మాది మధ్యతరగతి కుటుంబం కావడంతో కారు మాకు పెద్ద విషయం" అని ఆమె తన సాధారణ జీవనశైలి గురించి పంచుకున్నారు. తన కెరీర్‌లో ఎదురైన కొన్ని చేదు అనుభవాలను కూడా ఆమె గుర్తుచేసుకున్నారు. "'సత్యం రాజేష్ పక్కన చేసిందా? అయితే వద్దు' అని నా ముందే చాలా మంది అన్నారు. ఎవరి పక్కన నటిస్తున్నామనేది చూడటం చాలా తప్పు" అని ఆవేదన వ్యక్తం చేశారు. గ్లామర్ పాత్రల కన్నా మన ఇంట్లోని మహిళలను ప్రతిబింబించే సాధారణ పాత్రలు చేయడానికే తాను ఇష్టపడతానని స్పష్టం చేశారు. "ఓ తెలుగమ్మాయిగా మన తెలుగు అమ్మాయిల పాత్రల్ని నేను తెరపై చూపించకపోతే ఇంకెవరు చేస్తారు" అని ఆమె ప్రశ్నించారు. కేవలం థ్రిల్లర్ చిత్రాలకే పరిమితం కాకుండా, త్వరలో ఓ ప్రేమకథా చిత్రంలో కూడా నటించనున్నట్లు వెల్లడించారు. నటనపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టేందుకు డాక్టర్ వృత్తికి తాత్కాలికంగా విరామం ఇచ్చానని, భవిష్యత్తులో దర్శకత్వం చేయాలనే ఆలోచన కూడా ఉందని తెలిపారు. "'అగధ' చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను. ముఖ్యంగా ఎం.ఎస్. రాజు గారి కంబ్యాక్ కోసం అయినా ఈ సినిమా బ్లాక్ బస్టర్ అవ్వాలని కోరుకుంటున్నాను" అని కామాక్షి తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

Printed, Published and Owned by GATTU MAHESH, Printed at M R PUBLICATIONS, # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, EDITOR: GATTU MAHESH, JANAMVOICE PUBLICATIONS, 2-80/A, VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. RNI NO: TGTEL/26/A0383, CELL: 8008398069, MAIL ID: janamvoicedaily@gmail.com